ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

కడప
జిల్లా వార్తలు

ఆదివారం 11 మే 2025



ట్రాన్స్‌పోర్టు టెండర్లలో.. బినామీలు..!





కడప నగర శివారులోని భాకరాపేట సమీపంలో ఉన్న హెచ్‌పీసీఎల్ నుంచి రాయలసీమతో పాటు ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు ట్యాంకర్ల ద్వారా పెట్రోలు, డీజలు రవాణా చేసే రవాణా టెండర్ల వ్యవహారం ఇప్పుడు దుమారం రేపుతోంది. ఎస్సీ, ఎస్టీల పేరిట చెన్నై మాఫియా ఎంటరై అక్రమాలకు తెర లేపిందంటూ ఆ వర్గాలకు చెందిన కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ఎస్సీ, ఎస్టీల స్థానంలో ఇతరులు లబ్ధిపొందుతూ నిజమైన వారికి తీవ్ర అన్యాయం చేస్తున్నారంటూ వాపోతున్నారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు జాతోటి హుసేన్‌కు ఫిర్యాదు చేశారు. ఇప్పుడీ వ్యవహారం హెచ్‌పీసీఎల్‌లో హాట్‌టాపిక్‌గా మారింది.

- చెన్నై మాఫియా ఎంట్రీ
- ఎస్సీ, ఎస్టీల పేర్లతో డీజలు, పెట్రోలుకు టెండర్లు
- హెచ్‌పీసీఎల్‌లో గోల్‌మాల్
- న్యాయం చేయాలంటూ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఆ వర్గాల ఫిర్యాదు

(కడప-ఆంధ్రజ్యోతి): కడప నుంచి రాజంపేటకు వెళ్లే మార్గంలోని భాకరాపేట సమీపంలో హెచ్‌పీసీఎల్ ఉంది. ఇక్కడి నుంచి ఉమ్మడి కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురంతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు ట్యాంకర్ల ద్వారా పెట్రోలు, డీజలు సరఫరా చేస్తుంటారు. దీనికి సంబంధించిన కాంట్రాక్టు పరిమితి గత మార్చి చివరి నాటికి ముగిసింది. దీంతో 179 వాహనాల కోసం హెచ్‌పీసీఎల్ టెండరు నిర్వహించింది. పెట్రోలు, డీజలు సరఫరా చేసేందుకు గాను కిలోమీటరుకు రూ.43 హెచ్‌పీసీఎల్ రవాణా చార్జీలను చెల్లిస్తుంది. ఎస్సీ, ఎస్టీలకు ఈ టెండర్లలో రిజర్వేషన్ కల్పించింది. ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 7.5 శాతం రిజర్వేషన్ కల్పించారు. ఈ నేపథ్యంలో పెట్రోలు, డీజలు సరఫరా చేసేందుకు దాదాపు 600 బండ్లకోసం టెండర్లు వచ్చాయి.

చెన్నై ముఠా ఎంట్రీ

ఆర్థికంగా సామాజికంగా వెనుకబడ్డ ఎస్సీ, ఎస్టీలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలతో పాటు వారి లబ్ధి కోసం ప్రభుత్వాలు, పలు సంస్థలు రిజర్వేషన్లు కల్పిస్తున్నాయి. ఇందులో భాగంగానే హెచ్‌పీసీఎల్ ట్రాన్స్‌పోర్టు టెండర్లలో కూడా ఆ వర్గాలకు రిజర్వేషన్ కేటాయించింది. ఇప్పటి దాకా జిల్లాకు చెందిన పలువురు ఎస్సీ, ఎస్టీలు టెండర్లలో పాల్గొంటూ వచ్చారు. హెచ్‌పీసీఎల్ నిర్వహించిన వెహికల్ టెండర్లలో ఎస్సీ, ఎస్టీల పేరిట చెన్నై ముఠా ప్రవేశించింది. చెన్నైకి చెందిన నాలుగు ట్రాన్స్‌పోర్టుల పేరుతో దాదాపు 100 బండ్ల కోసం టెండరు వేశారు. అయితే 100 బండ్లకోసం ఇచ్చిన పేర్లన్నీ ఆ ట్రాన్స్‌పోర్టులో పనిచేసే ఎస్సీ, ఎస్టీ కూలీలవి కావడం గమనార్హం.

- వాకాడుకు చెందిన సుబ్బరత్నమ్మ ఎస్టీ. ఆమె పేరుతో చెన్నైకి చెందిన వ్యక్తి ఏడు వెహికల్స్‌కు ట్రాన్స్‌పోర్టు టెండరు వేశారు.
- నెల్లూరుకు చెందిన ఎస్సీ వర్గానికి చెందిన పురుషోత్తం పేరిట పది వెహికల్స్‌కు ఓ ట్రాన్స్‌పోర్టు పేరిట టెండరు దాఖలు చేశారు.
- తిరుపతి జిల్లాలోని గూడూరులో జీఎల్‌టీ లెమన్ సంస్థలో సురేశ్ అనే వ్యక్తి పనిచేస్తున్నారు. ఇతను ఎస్సీ. ఇతని పేరిట 17 వాహనాలకు టెండరు వేశారు. పేరు ఇతనిదే అయినప్పటికీ సెల్‌ఫోను, చిరునామా అన్నీ ఆ జీఎల్‌టీ లెమన్ సంస్థ ఓనరువి కావడం గమనార్హం.
- తమిళనాడులోని ఆర్కాట్ జిల్లాకు చెందిన ఓ ఎస్సీ డ్రైవరు అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. అతని పేరిటా మరొకరు టెండర్లు వేశారు.
- సీకేదిన్నె మండలంలోని బలిజపల్లె తాండకు చెందిన భార్యాభర్తలు ఎస్సీలు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి పేర్లతోనూ టెండర్లు వేశారు. ఇలా తమ పేర్లతో టెండర్లు వేసిన విషయం వాళ్లకే తెలీదు.

ఎస్సీ, ఎస్టీల స్థానంలో ఇతరులు

గూడూరుకు చెందిన ఓ జీఎల్‌టీ అధినేత తన పేరు, తన తండ్రి పేరుతో పాటు ఎస్సీల పేర్లతో కలిపి మొత్తం సుమారు 50 వాహనాలకు టెండరు వేశారు. ఈయన సిఫారసుతోనే చెన్నైకి చెందిన ట్రాన్స్‌పోర్టు బ్యాచ్ అంతా ఇక్కడికి వచ్చి వాళ్ల దగ్గర పనిచేసే వారిపేర్లతో టెండర్లు వేశారు. దీని వల్ల స్థానికంగా ఉంటున్న, నిజమైన ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరుగుతుందని అంటున్నారు. ఇటీవల ఈ విషయాన్ని కొందరు ఎస్సీ, ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే ఎస్సీ, ఎస్టీల పేరిట ఇతరులు టెండర్లు వేశారంటూ స్థానిక ఎస్సీ, ఎస్టీ నేతలు హెచ్‌పీసీఎల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మరి దీనిపై వారు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

జడ్పీ మాజీ చైర్మన్ సీఎం బలరామిరెడ్డి కన్నుమూత



సీఎం బలరామిరెడ్డి (ఫైల్‌ఫొటో)

కొండాపురం, మే 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సీఎం బలరామిరెడ్డి (90) శనివారం తెల్లవారుజామున చెన్నైలో మృతి చెందారు. కొండాపురం గ్రామానికి చెందిన ఈయన సినీనటుడు రాజ్‌కుమార్‌కు బిడ్డనిచ్చిన మామ. మాజీ ఎమ్మెల్యే సీఎం రామనాథరెడ్డికి అన్న. ఈయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య మూడేళ్ల కిందట మృతి చెందగా, కుమారుడు రవీంద్రనాథరెడ్డి ఆరు నెలల కిందట మృతి చెందారు. కొంతకాలంగా ఈయన చెన్నైలో అల్లుడు రాజ్‌కుమార్ ఇంటిలో ఉంటున్నారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన భౌతిక కాయానికి కొండాపురంలో అంత్యక్రియలు జరగనున్నాయి.

టీచర్ నుంచి జడ్పీ చైర్మన్ దాకా..

కొండాపురం ప్రాంతంలో సీఎం బలరామిరెడ్డి అంటే నైతిక విలువలు కలిగిన వ్యక్తిగా ప్రత్యేక గుర్తింపు ఉంది. ఉపాధ్యాయుడుగా, హెడ్మాస్టర్‌గా కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు, టి.కోడూరు హైస్కూళ్లతో పాటు పలు చోట్ల పనిచేశారు. 1981వ సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ముద్దనూరు సమితి ప్రెసిడెంట్‌గా గెలుపొంది జడ్పీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1984లో టీడీపీలో చేరారు. 1987లో టీడీపీ తరపున జడ్పీ చైర్మన్‌గా ప్రత్యక్ష ఎన్నికలలో కందుల శివానందరెడ్డిపై గెలుపొంది జడ్పీ చైర్మన్‌గా 1995 వరకు కొనసాగారు. ఆ తర్వాత ఆయన రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనూ ఆయనకు సాన్నిహిత్యం ఉంది.

నయనానందకరంగా తెప్పోత్సవం



పుష్కరిణిలో తెప్పపై స్వామివారి విహారం

తిరుమల తొలిగడప దేవుని కడప లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి తెప్పోత్సవం నయనానందకరంగా సాగింది. స్వామివారి తెప్పోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మొదటి రోజు సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకూ ఆలయ సమీప పుష్కరిణిలో స్వామివారు అమ్మవారు శ్రీకృష్ణ, గోదాదేవి రూపంలో మూడు ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమోహన్, సాయి, తరుణ్, క్రిష్ణమూర్తి, రఘనందన్, తదితరులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- కడప కల్చరల్ (ఆంధ్రజ్యోతి)

దర్యాప్తు నైపుణ్యాలను పెంచుకోవాలి : ఎస్పీ

కడప క్రైం, మే 10 (ఆంధ్రజ్యోతి): నేరస్తులకు శిక్ష పడేలా దర్యాప్తులో సాక్ష్యాలను సేకరించే నైపుణ్యాలను పెంచుకోవాలని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఫోరెన్సిక్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంటుపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ఫోరెన్సిక్ ఆధారాల సేకరణ, నిర్వహణ, చైన్ ఆఫ్ కస్టడీ తదితరాలపై అనుసరించాల్సిన విధివిధానాలు, ఆధునిక శాస్త్రీయ ప్రమాణాలపై ఎస్పీ ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పరిశోధనలో దర్యాప్తు అధికారులు నేరం జరిగిన చోటుకు ఏ విధంగా రక్షణ కల్పించాలి, నేరస్థలంలో డీఎన్ఏ రక్త నమూనాలు, మానవ అవయవాలు, నార్కోటిక్స్, మత్తు పదార్థాలు, వివిధ రకాల విషాలు, ఆడియో వీడియో, వివిధ పత్రాలు, భౌతిక సాక్ష్యాధారాలను ఏ విధంగా సేకరించాలి, ప్యాకింగ్, నిల్వ, భద్రపరచడం లెటర్ ప్రిపరేషన్, ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదిక వారంలో పొందే విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం వర్క్‌షాపులో పాల్గొన్న ఫోరెన్సిక్ నిపుణులు హసింబాషా, డాక్టర్ ఎం.కిశోర్‌కుమార్‌రెడ్డి, కుమారస్వామి, శ్యాంప్రసాద్‌లను ఎస్పీ శాలువా కప్పి సత్కరించి జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, డీడీ ప్రాసిక్యూషన్స్ ఎస్.ఖదీరున్నీసా, డీఎస్పీలు, సీఐలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర సిద్ధం

- జిల్లాకు చేరిన విద్యాసామగ్రి
- తొలిరోజే విద్యార్థులకు అందజేత



స్టాక్ పాయింట్‌లో విద్యార్థి మిత్ర స్టాక్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 ఇర్షాద్ అహ్మద్ తదితరులు

కడప ఎడ్యుకేషన్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరం పాఠశాల ప్రారంభించిన తొలిరోజే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, యూనిఫాంతో పాటు విద్యా సామగ్రి అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. జిల్లాలోని పాఠశాలలకు అవసరమైన సామగ్రిని భద్రపరిచేందుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు జిల్లాస్థాయి కమిటీ ప్రత్యేక పర్యవేక్షణలో అన్ని తరగతులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పేరుతో విద్యా సామాగ్రి పంపిణీకి కిట్లను సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు తెరిచేనాటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయాలన్న లక్ష్యంతో సమగ్ర శిక్ష ద్వారా అధికారులతో మండల, జిల్లా స్థాయి కమిటీలను నియమించారు. 10వ తరగతి వరకు ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, స్కూల్‌బ్యాగులు, మూడు జతల యూనిఫాం క్లాత్, బెల్టు, ఒక జత షూ, రెండు జతల సాక్సులు, డిక్షనరీ, వర్క్‌బుక్స్ ఇవ్వనున్నారు. కడప జిల్లాకు 1,34,275 స్కూల్ బ్యాగులు, 93,311 బెల్టులు, 1,34,275 యూనిఫాం, 1,35,852 షూస్, 7,70,154 నోటుపుస్తకాలు, 23,956 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు అవసరం కాగా.. ఇప్పటికే జిల్లాకు కొన్ని చేరగా మిగిలినవి కూడా చేరుతున్నాయి.

ప్రత్యేక పర్యవేక్షణ

ప్రతి విద్యార్థికి విద్యాకిట్లు అందేలా ప్రత్యేక పర్యవేక్షణకు కమిటీలు ఏర్పాటయ్యాయి. జిల్లాస్థాయి కమిటీలో హెడ్‌గా సమగ్ర శిక్ష ఏపీసీ వ్యవహరిస్తుండగా, కన్వీనర్‌గా సీఎంఓ, సభ్యులుగా జీసీడీఓ, ఎంఐఎస్ కోఆర్డినేటర్, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ నియమితులయ్యారు. వీరంతా జిల్లా, మండలస్థాయిలో స్టాక్ పాయింట్లను గుర్తించి వచ్చిన వస్తువుల నాణ్యతను పర్యవేక్షించి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తారు. అలాగే మండలస్థాయి కమిటీలో హెడ్‌గా ఎంఈఓ, సభ్యులుగా నలుగురు ఇంజనీరింగ్ సిబ్బంది, ఎంఐఎస్ డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సీఆర్ఎంటీ, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు కిట్లను మండల స్టాక్ పాయింట్లలో భద్రపరిచి రిజిస్టర్‌లో నమోదు చేసుకుంటారు. ట్రాన్స్‌పోర్టు ద్వారా పాఠశాలలకు కిట్లు చేరవేస్తారు. అనంతరం ఎంఈఓ బయోమెట్రిక్ విధానం ద్వారా పాఠశాలలకు కిట్లను చేరుస్తారు. ఎంఈఓలు బయోమెట్రిక్ విధానం ద్వారా కిట్లను అందజేస్తారు. అలాగే పాఠశాల కమిటీలో ప్రధానోపాధ్యాయులు, గ్రామ సచివాలయం ఎడ్యుకేషన్ అసిస్టెంట్, మహిళా పోలీస్, తల్లిదండ్రుల కమిటీ సభ్యుల సమక్షంలో విద్యార్థి కిట్లు పంపిణీ చేస్తారు. విద్యా సామగ్రి అందుకున్న విద్యార్థులతో బయోమెట్రిక్ వేయించి రోజువారి రిపోర్టులను ఎంఈఓ, ఇతర పైఅధికారులకు పంపుతారు.

తొలిరోజే ప్రతి విద్యార్థికి కిట్లు



పాఠశాలలు ప్రారంభమైన తొలిరోజే ప్రతి విద్యార్థికి విద్యార్థి మిత్ర కిట్లు అందజేసేలా చర్యలు తీసుకుంటున్నాం. నాణ్యతను పరిశీలించి స్టాక్ పాయింట్లలో భద్రపరుస్తున్నాం. వీటికోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక కమిటీలు విద్యార్థి పూర్తి వివరాలను నమోదు చేసుకోవడంతో పాటు ప్రతి విద్యార్థికి అందేలా కార్యాచరణ రూపొందించాం.

- నిత్యానందరాజు, సమగ్ర శిక్ష, ఏపీసీ, కడప

సంక్షేమ వసతి గృహాలకు మరమ్మతులు

- రూ.7.51 కోట్లతో మౌలిక వసతులు
- కొనసాగుతున్న పనులు

కడప ఎన్జీఆర్‌సర్కిల్, మే 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు రూ.7.51 కోట్లతో మెరుగైన వసతులకు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో 67 వసతి గృహాలు ఉండగా.. 60 వసతి గృహా లను ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్నారు. మరో ఏడు వసతి గృహాలు అద్దెభవనాల్లో నడుస్తున్నాయి. ప్రభుత్వ భవనాల్లో ఉన్న వసతి గృహాలకు మరింత మెరుగైన వసతులు కల్పించడం కోసం ఈ నిధులు వెచ్చిస్తారు. గత వైపీపీ ప్రభుత్వ హయాంలో వసతిగృహాల్లో విద్యార్థులు సరైన సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు పడ్డారు. వసతి గృహాలకు ఉన్న కిటికీలు విరిగిపోయి చలికి దోమలతో ఇబ్బంది పడ్డారు. మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నప్పటికీ నిర్వహణ లేకపోవడంతో ఏ మాత్రం సౌకర్యవంతంగా లేక వినియోగించుకునేందుకు పెద్దగా ఆసక్తి చూపేవారు కాదు. ఇక వసతి గృహాల్లో సరైన విద్యుత్ సౌకర్యం, రక్షిత మంచినీరు అందుబాటులో లేక ఇబ్బందులు పడేవారు. ప్రధానంగా వర్షాకాలంలో భవనాలు కారుతుండడంతో విద్యార్థులు అవస్థలు పడేవారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు సంక్షేమ వసతిగృహ విద్యార్థులు అనేక విధాలుగా అవస్థలు పడ్డారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత వసతిగృహాల మరమ్మతులపై దృష్టి సారించి పనులు మంజూరు కావడంతో విద్యార్థులకు మరింత మెరుగైన మౌలిక వసతుల కల్పన అందుబాటులోకి వచ్చే పరిస్థితి కనిపిస్తోంది.



కడప కళాశాల హాస్టల్‌లో జరుగుతున్న మరమ్మతు పనులు

28 చోట్ల మరమ్మతు పనులు

జిల్లాలోని 28 సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రూ.7.51 కోట్లు నిధులు విడుదల చేశారు. ఇక వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన వసతుల కల్పన కోసం పనులు మొదలుపెట్టారు. ప్రధానంగా తాగునీరు, మరుగుదొడ్ల, గదుల మరమ్మతులతో పాటు కిటికీలు తయారు చేసి దోమలు రాకుండా చేపట్టే నివారణ చర్యల్లో భాగంగా మెనూను మార్చనున్నారు. వీటితో పాటు అవసరమైన చోట్ల అదనపు భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు.



మరమ్మతు పనులు పరిశీలిస్తున్న డీడీ సరస్వతి

బాలికల వసతిగృహాలకు ప్రాధాన్యత

సాంఘిక సంక్షేమ వసతిగృహాల మరమ్మతుల్లో జిల్లాలోని బాలికల వసతిగృహాలకు ప్రథమ ప్రాధాన్యతనిచ్చారు. ఈ క్రమంలో సీకేదిన్నె మండలంలో రెండు, పెండ్లిమర్రి మండలంలోని నందిమండలం, కడప నగరంలో ఐదు వసతిగృహాలు, పులివెందుల పట్టణంలో ఐదు వసతిగృహాల్లో మరమ్మతులు చేపడుతున్నారు. అదే విధంగా బద్వేలు మండలంలోని రెండు వసతిగృహాలు, బి.మఠం మండలం 2, ప్రొద్దుటూరులో 2, జమ్మలమడుగులో 2, మైదుకూరు, పోరుమామిళ్ల, కలసపాడు, ఎర్రగుంట్ల, కమలాపురం సిద్దవటం, ఖాజీపేట మండలంలోని వసతిగృహాల్లో మరమ్మతు పనులు జరుగుతున్నాయి.

పాఠశాలలు తెరిచే నాటికి పూర్తి



వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి మరమ్మతు పనులు పూర్తయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నాం. చాలా చోట్ల దాదాపు ఇప్పటికే పనులు పూర్తయ్యాయి. ఇంకా ఎక్కడైనా పెండింగు పనులు ఉంటే పూర్తి చేసేందుకు దృష్టి సారిస్తున్నాం. మిగిలిన వసతిగృహాల్లో కూడా మౌలిక వసతుల కల్పన కోసం నిధులు మంజూరు చేయాలంటూ ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పనులు మొదలుపెడతాం.

- కె.సరస్వతి, డిప్యూటీ డైరెక్టరు, సాంఘిక సంక్షేమశాఖ

దాహంతీరే దారేది..?



ఎండలు మండిపోతున్నాయి. గుక్కెడు నీటికోసం మూగజీవాలు ఇబ్బందులు పడుతున్నాయి. కడప నగరానికి ఆనుకుని ఉన్న శేషాచల కొండల్లో నీటిమడుగులన్నీ ఎండిపోవడంతో కోతులు నీటిని వెతుక్కుంటూ జనావాసాల వైపు వస్తున్నాయి. రాజంపేట మార్గంలోని జేఎంజే కళాశాల వద్ద ఓ బకెట్‌లో ఉన్న కొద్దిపాటి నీళ్లను చూసిన కోతికి ఊపిరి వచ్చినట్టయింది. అందులోని నీటిని తాగడంతో పాటు తన బిడ్డకూ తాపించింది. ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి శనివారం తన కెమెరాలో బంధించింది.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప



బిడ్డా.. దాహం తీర్చుకో



హమ్మయ్యా.. నీళ్లున్నాయి



నాకు నా బిడ్డకు సరిపోతాయి



ముందు నేను తాగుతా

నల్లగంగమ్మ.. చల్లంగ చూడమ్మా...


● అత్యంత మహిమ గల దేవరాయి ● ముస్తాబవుతున్న నల్లగంగమ్మ ఆలయం ● రేపు మొలకల పౌర్ణమి నాడు ఘనంగా అమ్మవారి జాతర

సంబేపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి): సంబేపల్లె దేవరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఈనెల 12వ తేదీ మొలకలపౌర్ణమి సందర్భంగా జాతర వైభవంగా జరగనుంది. ఆలయంలోని దేవరాయి **ఎంతో మహిమ గలదని ప్రజలు రకరకాలుగా చెబుతుంటారు.** దీర్ఘకాలంగా వివిధ రోగాలతో బాధపడుతున్న భక్తులు ఈ రాయిపై పొర్లు దండాలు పెడితే అవి నయమవుతాయని భక్తుల విశ్వాసం. ఆలయ చరిత్రను పరిశీలిస్తే.. పూర్వంలో ఓ బండరాయి సంబేపల్లె గ్రామం సమీపంలో నాలుగు కొండల మధ్య దట్టమైన ముళ్లపొదల్లో ఉండేది. ఓ మేకల కాపరి మేకలు మేపుకుంటుండగా ఆ రాయిపై కాలు పెట్టిన ఓ కుంటిమేకకు కాలు బాగవడంతో ఆ కాపరి గ్రామస్తులకు ఈ విషయాన్ని చెప్పాడు.

అంతే గ్రామస్తులు ముళ్లపొదల్లో వెతికి చూడగా ఆ బండపై తెలియని భాషలో అక్షరాలు, ముగ్గులు ఉండటంతో జనం ఆనాటి నుంచి ఆ రాతికి పూజలు చేయడం ప్రారంభించారు. తీర్థయాత్రలకు వెళుతున్న ఓ మహాముని చూసి ఇది శక్తివంతమైన దేవరాయిగా గుర్తించి ఆ బండ రాతికి ఎదురుగా నల్లగంగమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించి వెళ్లారు. చిన్నగుడిగా ఉన్న ఈ ఆలయాన్ని 2005లో రాయచోటి పట్టణానికి చెందిన వ్యాపారవేత్త మునగా మురళీ స్వామి అమ్మవారి ఆశీస్సులతో ఆలయ నిర్మాణం చేశారు.

శక్తి ప్రదాయిని నల్లగంగమ్మ తల్లి

ఈ ఆలయం చుట్టూ కొండలు. ఆ కొండల మధ్య సువిశాలమైన ప్రాంతంలో నల్లగంగమ్మ ఆలయం నిర్మించారు. ఈ ఆలయానికి తూర్పున కదిరిదేవుని కొండ, పడమర దుర్గం కొండ, ఉత్తరాన వెదుర్ల కాండ, దక్షిణాన ముగదాల కొండ మధ్యన వెలిసిన నల్లగంగమ్మ తల్లి భక్తుల కోర్కెలు తీర్చే అమ్మగా పిలవబడుతోంది. కర్ణాటక, చిత్తూరు, కడప తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకోవడం విశేషం. ఇక్కడ సినిమా హీరో శరత్‌కుమార్ తమిళ చిత్రం షూటింగ్ కూడా జరిగింది.





ప్రత్యేక అలంకరణలో నల్లగంగమ్మ తల్లి, మహిమ గల దేవరాయి

గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి రూ.1.18 కోట్లతో 2022లో మహా మండపం నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. పనులు పూర్తి కావడంతో సర్వాంగ సుందరంగా ఆలయం తయారైంది. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఆలయం చుట్టూ రూ.ఒక కోటి నిధులతో సిమెంటు రోడ్లు వేశారు.

12న అమ్మవారి జాతర

ఈనెల 12వ తేదీన మొలకలపౌర్ణమి సందర్భంగా అమ్మవారి జాతర కనులపండువగా జరుగుతుంది. చిత్తూరు, తిరుపతి, కడప, అనంతపురం ప్రాంతాల నుంచి ప్రజలు అమ్మవారి జాతరలో పెద్దఎత్తున పాల్గొంటారు. రాత్రి భక్తుల కోసం జబర్దస్త్ యాక్టర్లచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అనంతరం అమ్మవారికి మొక్కుబడి కోసం కట్టిన చాందినీ బండ్లను ఆలయం చుట్టూ తిప్పి 13వ తేదీ అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కుబడులు చెల్లిస్తారు.



గతంలో ఇక్కడ ఉన్న పురాతన ఆలయం, ఆలయాన్ని నూతనంగా నిర్మించిన మునగా మురళీస్వామి

చింత తీర్చే చిగురు!





చింత చిగురును కొనుగోలు చేస్తున్న మహిళ

పీలేరు, మే 10 (ఆంధ్రజ్యోతి): వేసవిలో మాత్రమే దొరికే ఆహార పదార్థాల్లో మామిడి, తాటి ముంజల తరువాత చింత చిగురు కూడా ఒకటి. వేసవి వచ్చిందంటే గ్రామాలలో చిన్నపిల్లల దగ్గర నుంచి వృద్ధుల వరకు చింత చెట్ల చుట్టూ చేరి చిగురు సేకరిస్తుంటారు. దాంతో వివిధ కూరలు చేసి తింటుంటారు. చింత చిగురు రుచికరమైన కూరనే కాకుండా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కూడా అందిస్తుందని, చింతపండు కంటే చింత చిగురు ఎక్కువ ప్రయోజన కారి అని ఆయుర్వేదం చెబుతోంది. చింత చిగురులో ఎన్నో పోషక విలువలు, ఔషధ గుణాలు ఉన్నాయని పౌషకాహార నిపుణులు చెబుతున్నారు. చింత చిగురు కనిపిస్తే వెంటనే కొనుక్కుని రుచికరమైన కూరలు చేసుకుని ఆరగించాలని వారు సూచిస్తున్నారు.

ఆరోగ్య ప్రయోజనాలు

- చింత చిగురు సహజ సిద్ధమైన లాక్జేటివ్‌గా పనిచేస్తుంది.
- యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండడంతో చింత చిగురు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది.
- చిగురును ఉడికించిన నీటిని పుక్కిలిస్తే గొంతు నొప్పి, మంట, వాపు తగ్గుతాయి. యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చింత చిగురులో ఉండడమే ఇందుకు కారణం.
- కడుపులో నులి పురుగుల సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు చింత చిగురుతో చేసిన వంటలు తినిపిస్తే ఫలితం ఉంటుంది.
- జీర్ణాశయ సంబంధ సమస్యలను తొలగించడంలో చింత చిగురు బాగా ఉపయోగపడుతుంది. ఈ చిగురులో విటమిన్-సీ, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి శరీరంలో రోగ నిరోధక వ్యవస్థను పటిష్టపరుస్తాయి.
- తరచూ చింత చిగురును తింటే ఎముకలు ధృడత్వాన్ని సంతరించుకుంటాయి.
- థైరాయిడ్‌తో బాధపడేవారు చింత చిగురును తమ ఆహారంలో తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.
- గుండె జబ్బులను చింత చిగురు దరిచేరనీయదు. శరీరంలో ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి అవసరమైన పోషకాలను అందించడమే కాకుండా రక్తాన్ని శుద్ధి చేస్తుంది.
- చింత చిగురును పేస్టులా చేసి కీళ్లపై పెడితే నొప్పులు, వాపులు తగ్గుతాయి.

ఆదాయ మార్గంగా...

చింత చిగురు సేకరణను పీలేరు ప్రాంతంలోని చాలా మంది విద్యార్థులు వేసవి సెలవుల్లో ఆదాయ మార్గంగా మలుచుకుంటున్నారు. తమ సమీప ప్రాంతాల్లోని చింత చెట్ల నుంచి సేకరించిన చిగురును తమ తల్లిదండ్రులు, సోదరుల ద్వారా పీలేరులో ప్రతిరోజూ ఉదయం జరిగే దినసరి కూరగాయల మార్కెటులో విక్రయిస్తున్నారు. గతంలో పీలేరు ప్రాంతంలో చింత చెట్లు ఎక్కువగా ఉండేవి.

గడిచిన మూడేళ్లుగా చింత చెట్లకు ఎక్కువగా వస్తున్న చీడపీడల కారణంగా చిగురు దిగుబడి తగ్గిపోవడం, రోడ్ల విస్తరణ కారణంగా చింత చెట్లు కనుమరుగు కావడంతో వారికి చిగురు అంతంత మాత్రంగానే లభ్యమవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కుప్ప రూ.10 నుంచి రూ.20ల వరకు విక్రయిస్తున్నారు. సెలవుల్లో చిగురు కారణంగా సంపాదించిన అరాకొర డబ్బులతో స్కూళ్లు తెరిచాక పుస్తకాలు కొనుక్కుంటామని పలువురు తెలిపారు.

పవనసుతుడిపై పెంచలోరి వైభోగం

- **ఉదయం హంసవాహనంపై ..**
- **నేడు నృసింహ జయంతి**
- **భారీగా తరలిరానున్న భక్తులు**

రాపూరు, మే 10 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోన క్షేత్రంలో లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు అంగరంగ వేభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో మూడవరోజు శనివారం ఉదయం పెంచలస్వామి సరస్వతీ అలంకరణలో హంసవాహనంపై విహరించారు. యాగశాలలో నిత్య హోమాలు, ఉత్సవమూర్తులకు ప్రత్యేక చందనాలంకారం, అభిషేకాలు కొనసాగుతున్నాయి. సాయంత్రం స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ సేవ, రాత్రి తిరుచ్చిపై శ్రీవారిని ఉంచి క్షేత్రోత్సవం నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, ఈవో పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు, ఉభయకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● స్వర్ణ హనుమంతుడిపై..

రాత్రి పెంచలస్వామి రామావతారంలో విల్లంబులు చేతబట్టి బంగారు హనుమంతుడిపై కొలువుదీరి భక్తులకు దర్శనం ఇచ్చారు. పరిమళ భరిత పూలమాలలు, విశేష ఆభరణాలతో అలంకృతమైన స్వామివారు మాడవీధుల్లో విహరించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ కోన వీధుల్లో స్వామివారికి క్షేత్రోత్సవం నిర్వహించారు. కడప, అన్నమయ్య, తిరుపతి జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం స్వామివారి సన్నధిలో శివ నృత్య కళా నిలయానికి చెందిన (నెల్లూరు) చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



హంస వాహనంపై విహరిస్తున్న స్వామివారు



స్వర్ణ హనుమంతుడిపై విహరిస్తున్న పెంచలస్వామి

నేడు స్వర్ణగరుడ సేవ

భక్తుల ఇష్టదైవం లక్ష్మీ నృసింహుడు. ఈయనకు ప్రీతిపాత్రమైన వాహనం గరుత్మంతుడు. ఈ దేవదేవుడి జన్మదినం (నృసింహ జయంతి) ఆదివారం. ఎంతో విశిష్ట కలిగిన ఈ పర్వదినాన తమ దైవాన్ని కనులారా వీక్షించేందుకు కోనకు భక్తజనం పోటెత్తనుంది. ఆదివారం రాత్రి 11 గంటలకు స్వర్ణ గరుడుడిపై శ్రీవారు కొలువుదీరి మాఢవీధుల్లో విహరించనున్నారు.

కోదండరాముడికి స్నపన తిరుమంజనం

ఒంటిమిట్ట, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట కోదండ రామాలయంలో శనివారం స్నపన తిరుమంజనం కార్యక్రమం వైభవంగా జరిగింది. శనివారం వేకువజామునే ఆలయ అర్చకులు వీణరాఘవాచార్యులు, మనోజ్ కుమారులు మూలవిరాట్లకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్‌స్వామి వారికి పట్టు వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలను అందజేశారు. అర్చకులు స్వామివారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ అధికారులు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.



సుగంధ ద్రవ్యాలను తీసుకువస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పీలేరు రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. కేవీపల్లె ఎస్‌ఐ చిన్నిరెడ్డెప్ప కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కలికిరి మండలం గుడ్లూరుకు చెందిన సయ్యద్ బాషా (35) ద్విచక్ర వాహనంపై కలకడ నుంచి పీలేరు వైపు వస్తుండగా పీలేరు నుంచి కలకడ వైపు వెళుతున్న బొలెరో వాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు పీలేరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కేవీపల్లె ఎస్‌ఐ తెలిపారు.



సయ్యద్ బాషా మృతదేహం

సంబేపల్లె యువకుడు బెంగళూరులో...

సంబేపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండలం ఇందిరానగర్‌కు చెందిన సుండపల్లె సాయిమహేశ్ (21) బెంగళూరులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి బంధువుల వివరాల మేరకు... సాయిమహేశ్ ఉద్యోగ ప్రయత్నంలో భాగంగా వారం రోజుల క్రితం బెంగళూరుకు వెళ్లాడు. తన ఖర్చుల నిమిత్తం ఖాళీ సమయంలో డెలివరీ బాయ్‌గా పనిచేసేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి బయప్పనపల్లి రైల్వేస్టేషన్ పరిధిలో ఆర్డర్ డెలివరీ చేసి తిరిగి వస్తున్న సమయంలో రైల్వే క్రాసింగ్ చేస్తుండగా రైలు ఢీకొని దుర్మరణం చెందాడు. ఉద్యోగం సాధించి తమకు ఆధారంగా ఉంటాడని ఆశించిన ఆ కుటుంబం అతడి మృతితో ఆశను కోల్పోయింది. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.



సాయిమహేశ్ (ఫైల్)

రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

రైల్వేకోడూరు రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద బాధితుడికి శనివారం రాయలసీమ విద్యార్థి పరిరక్షణ సమితి అధ్యక్షుడు మల్లెం హేమంత్ రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలగౌరీమురళీయాదవ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడన్నారు. విద్యార్థులు, స్నేహితులు, ఆర్ఎస్‌పీఎఫ్ కమిటీ కలిసి చందాలు వేసుకుని ఆయనకు సాయం అందించామన్నారు. కార్యక్రమంలో అలుగంటి పరుశురాం, పోలవరపు కిషోర్, విష్ణువర్ధన్, సూరిబాబు, మల్లెం శివ, బాష, కృష్ణ, పవన్ తదితరులు పాల్గొన్నారు.



నగదును అందజేస్తున్న మల్లెం హేమంత్

కమిటీ చిన్నది.. ఆదాయం పెద్దది...

- **ఆదాయంలో దూసుకెళ్తున్న ములకలచెరువు మార్కెట్ కమిటీ**
- **లక్ష్యానికి మించి ఆదాయం... కరోనా సమయంలోనూ....**
- **టమోటా క్రయ... విక్రయాలతో పాటు ఆదాయంలో ముందుకు**

ములకలచెరువు, మే 10 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు వ్యవసాయ మార్కెట్ కమిటీ చిన్నదైనా... ఆదాయంలో పెద్దదిగా ఉంది. ప్రతి ఏటా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని మించి ఆదాయంలో దూసుకెళ్తోంది. టమోటా క్రయ, విక్రయాల్లో ఆసియాలోనే అతి పెద్ద మార్కెట్‌గా పేరొందిన మదనపల్లె మార్కెట్‌ను ఎప్పుడో వెనక్కి నెట్టింది. ములకలచెరువు మార్కెట్‌లో అత్యధికంగా టమోటా క్రయ, విక్రయాలు జరుగుతున్నాయి. ఇక్కడి నుంచే టమోటాలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. అలాగే ఆదాయంలో కూడా లక్ష్యానికి మించి దూసుకెళ్తోంది. కరోనా సమయంలోనే ప్రభుత్వం కేటాయించిన ఆదాయ లక్ష్యాన్ని పూర్తి చేసుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యమైన రూ.1.24 కోట్లను అధిగమించి రూ.1.32 కోట్లు ఆదాయం వచ్చింది. ఒక్క టమోటాల ఎగుమతి చేస్తున్న వాహనాలకు విధిస్తున్న సెస్సు రూపంలోనే ఇంత పెద్దమొత్తంలో ఆదాయం వస్తుందంటే టమోటా క్రయ, విక్రయాల్లో ఏ స్థాయిలో జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. దీంతో ములకలచెరువు మార్కెట్ కమిటీ ఎంతో ప్రాధాన్యత సంచరించుకుంది. తంబళ్లపల్లె నియోజకవర్గానికి సంబంధించి మార్కెట్ కమిటీ ములకలచెరువులో ఉంది. మదనపల్లె మార్కెట్ కమిటీని పునర్విభజన చేసి 1992లో ములకలచెరువు మార్కెట్ కమిటీని ఏర్పాటు చేశారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలతో పాటు తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాల్లో రైతులు పండించిన టమోటాలను విక్రయించేందుకు ఇక్కడికి తీసుకొస్తారు. ఇక్కడ మండీ యజమానులు టమోటాలకు వేలం పాటలు నిర్వహిస్తారు. బయటి రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారస్థులు టమోటాలు కొనుగోలు చేస్తారు. కొనుగోలు చేసిన టమోటాలను లారీలు, లగేజీ వాహనాల్లో ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. టమోటాలు ఎగుమతి చేసే వాహనాలకు మార్కెట్ కమిటీ సిబ్బంది ఒక శాతం సెస్సు విధించి రసీదు ఇస్తారు. అలాగే ములకలచెరువు, బురకాయలకోటల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులలో వేరుశనగకాయలు, వడ్లు, మొక్కజొన్నలు, రాగులు, ఉలవలు, కందులు తీసుకెళ్లే వాహనాలకు కూడా ఒక శాతం సెస్సు విధిస్తారు. 2012లో కరోనా వ్యాప్తి అధికంగా ఉన్న సమయంలో కూడా ములకలచెరువు మార్కెట్ కమిటీ ఆదాయంలో లక్ష్యాన్ని ఛేదించి లాభాలు రాబట్టింది.

నాలుగేళ్లలో మార్కెట్ కమిటీకి సమకూరిన ఆదాయం వివరాలు

ఏడాది	లక్ష్యం	ఆదాయం
2021-22	రూ.86.14 లక్షలు (కరోనా సమయం)	రూ.98 లక్షలు
2022-23	రూ.కోటి	రూ.1.10 కోట్లు
2023-24	రూ.1.10కోట్లు	రూ.1.12 కోట్లు
2024-25	రూ.1.24 కోట్లు	రూ.1.32 కోట్లు



మార్కెట్ యార్డు ప్రధాన ద్వారం



మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన టమోటాలు


మండీలు...దుకాణ సముదాయాల ద్వారా మరింత...

ములకలచెరువు మార్కెట్ కమిటీకి టమోటా మండీలు, దుకాణ సముదాయాల ద్వారా మరింత ఆదాయం వస్తోంది. టమోటా మండీలు, దుకాణాల సముదాయం ద్వారా ప్రతి నెలా బాడుగ వస్తోంది. వీటి ద్వారా ప్రతి ఏటా రూ.25 లక్షలు వరకు ఆదాయం సమకూరుతోంది. ములకలచెరువు వ్యవసాయ మార్కెట్ ద్వారా ప్రభుత్వానికి ప్రతి ఏటా భారీగా ఆదాయం సమకూరుతోంది. టమోటా క్రయ, విక్రయాలు మరింతంగా పుంజుకుంటే ఆదాయంలో కూడా మదనపల్లె మార్కెట్‌ను మించిపోయే అవకాశం లేకపోలేదు.

గ్రేడ్ తక్కువ...ఆదాయం ఎక్కువ

ములకలచెరువు మార్కెట్ కమిటీ ఆదాయం బాగా ఉన్నా ఏళ్ల తరబడిగా గ్రేడ్ పెరగడం లేదు. మార్కెట్ కమిటీకి ప్రతి ఏటా లక్ష్యానికి మించి ఆదాయం వస్తోంది. అయితే సహాయ కార్యదర్శి హోదాలోనే ఉండిపోయింది. గ్రేడ్ పెరిగితే ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంది. గ్రేడ్ పెరిగి సిబ్బంది అధికారులు, సిబ్బంది సంఖ్య పెరిగితే ఆదాయంలో మదనపల్లె మార్కెట్ ఆదాయంలో పోటీ పడే అవకాశం ఉంది. గ్రేడ్ పెంచాలని పంపిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వమైనా మార్కెట్ కమిటీ గ్రేడ్ పెరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సమష్టి కృషితోనే ఆదాయం



సమిష్టి కృషితోనే లక్ష్యానికి మించి ఆదాయం సాధించగలిగాం. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి మించి ఆదాయం సాధించడానికి మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, డీడీ శ్రీకాంత్‌రెడ్డి, ఏడీ త్యాగరాజు సూచనల మేరకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. మార్కెట్ నుంచి టమోటాలు ఎగుమతి చేస్తున్న వాహనాలకు ఒక శాతం సెస్సు విధిస్తున్నాం. అలాగే చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి కూడా సెస్సులు వసూలు చేస్తున్నాం. సిబ్బంది సహకారంలో ఆదాయం సాధిస్తున్నాం.ఈ ఏడాది ఆదాయం మరింతగా పెంచే విధంగా ముందుకుకెళ్తున్నాం. ఆదాయం వచ్చేందుకు కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.

\- నవీన్‌కుమార్‌రెడ్డి,
మార్కెట్ కమిటీ కార్యదర్శి, ములకలచెరువు

శేషవాహన సేవలో లక్ష్మీ నృసింహస్వామి



పెండ్లిమర్రి, మే 10 (ఆంధ్రజ్యోతి): వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వెయ్యినూతులకోన ఆలయంలో శేషవాహన సేవలో లక్ష్మీ నృసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయాన్నే వేదపారాయణం, విశ్వక్సేన ఆరాధన సాయంత్రం ధ్వజారోహణం, కలశస్థాపన, అగ్నిప్రతిష్ట, శాంతిహోమం నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని వేదపారాయణంలో పాల్గొన్నారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

నాడు ఆదర్శం... నేడు దయనీయం

- పర్యవేక్షణ కరువై సమస్యలతో సతమతం
- కనీస సౌకర్యాలకు దూరంగా కాకిరేణిపల్లె

ప్రొద్దుటూరు రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): కాకిరేణిపల్లె సింగిల్ విలేజ్ గ్రామ పంచాయతీ. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో జిల్లాలోనే ఆదర్శ పంచాయతీగా పేరుగాంచింది. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిర్మల్ గ్రామ పురస్కార్ అవార్డును కైవసం చేసుకుంది. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు నియోజకవర్గాల సరిహద్దు ప్రాంతంలో ఉన్న మారుమూల గ్రామం కాకిరేణిపల్లె ప్రస్తుతం కనీస సౌకర్యాలకు నోచుకోక తల్లడిల్లుతోంది. పర్యవేక్షణ కరువై, ప్రగతికి దూరమై సమస్యలతో సతమతం అవుతోంది. అటు పాలకులు, ఇటు అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో మౌలిక వసతులు లేక ప్రజల పాట్లు వర్ణనాతీతం.

కాకిరేణిపల్లె గ్రామ పంచాయతీలో దాదాపు 250 ఇళ్లు ఉండగా 600 మంది ఓటర్లతో, వెయ్యి మంది జనాభా ఉంది. ఇక్కడ ఏదైనా మౌలిక వసతుల్లో సమస్య తలెత్తితే పరిష్కరించే నాథుడు కరువయ్యారు. గ్రామంలో పంచాయతీ కార్యాలయం ఉన్నా అక్కడ సిబ్బంది ఉండరు. పంచాయతీ కార్యదర్శి మాత్రం తరచూ వచ్చి వెళుతుంటారు. గ్రామానికి మూడున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న చౌడూరులో కాకిరేణిపల్లెకు సంబంధించిన సచివాలయం ఉంది. సిబ్బంది అక్కడే విధులు నిర్వహిస్తుంటారు. దీంతో ఎలాంటి అవసరమొచ్చినా చౌడూరుకు వెళ్లాల్సి రావడంతో గ్రామస్థులకు వ్యయభారంగా మారింది. రోజుకు కనీసం నాలుగు గంటలు అయినా అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు గ్రామంలో అందుబాటులో ఉండాలని కోరుతున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి...

గ్రామంలో తాగునీటి సరఫరా పైపులైనులో సమస్య ఏర్పడి సుమారు నెల రోజులపాటు తాగునీటికి తీవ్ర ఇబ్బందులకు గురయ్యామని గ్రామస్థులు వాపోయారు. కనీసం మూగ జీవాలకు కూడా నీరు అందించలేని పరిస్థితుల్లో పాచిపట్టిన కోనేరులోని నీటిని ట్యాంకుల్లో నింపుకుని అవసరాలను తీర్చుకుంటూ అష్టకష్టాలు పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గ్రామానికి సరఫరా అయ్యే ప్రధాన పైపులైను మళ్లీ లీకేజీలకు గురైంది. పెన్నాతీరం వద్ద చౌడూరు, పూజా ఇంటర్నేషనల్ స్కూల్, కాకిరేణిపల్లె గ్రామాలకు సరఫరా అయ్యే ప్రధాన పైపులైను ఉన్న ప్రాంతంలో ఇసుక ట్రాక్టర్ల రవాణా తాకిడికి లీకేజీలు మొదలయ్యాయి. కాకిరేణిపల్లె-చౌడూరు గ్రామం మధ్యలో పొలాల్లో మరొక చోట పైపులైను డ్యామేజీ అయ్యింది. దీనిపై ఎవరు దృష్టి సారించడంలేదని గ్రామస్థులు వాపోయారు.

చినుకుపడితే చిత్తడే

గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ లేదు. మురికినీటిని ఎవరి ఇళ్ల వద్ద వారే గుంతలు తవ్వుకుని వాటిల్లో వదులుతున్నారు. ఎగుడుదిగుడు రోడ్లు ఉన్న ఈ ప్రాంతంలో చినుకుపడితే అంతా చిత్తడిగా మారుతుంది. వర్షాకాలంలో గ్రామంలో నడవలేని పరిస్థితి. ఇటీవల కురిసిన వర్షానికి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట అపరిశుభ్రత నెలకొంది.

ఒకే ఒక్కడు

పారిశుధ్య నిర్వహణ గ్రామంలో అంతంత మాత్రమే. కాకిరేణిపల్లె మొత్తానికి ఒకే ఒక పారిశుధ్య కార్మికుడు ఉన్నాడని గ్రామస్థులు చెబుతున్నారు. చక్రాల రిక్షాపై రోజు కసువు సేకరణ చేయాల్సి వస్తుందని తెలిపారు. గ్రామంలో ఎక్కువగా పాడి సంపద ఉందని, వారానికి ఒక్కసారి అయినా పశువైద్య అధికారులు గ్రామంలో క్యాంపు నిర్వహించి వైద్యసేవలు అందించాలని కోరుతున్నారు.

గ్రామంలో నెలకొన్న సమస్యలపై పంచాయతీ కార్యదర్శి ఎం.రాజేశ్వరిని వివరణ కోరగా సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామని చెప్పారు. ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి స్పందిస్తూ ఇటీవలే తాగునీటి పైపులైన్ల మరమ్మతు చేశామని, ఏవైనా సమస్యలు ఉంటే సర్పంచులు, కార్యదర్శుల ద్వారా తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు.



వాన వస్తే..

వర్షం కరిస్తే ఇళ్ల నుంచి బయటకు రాలేం. గ్రామంలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న సిమెంటు రోడ్డు ఎత్తులో ఉండడంతో వర్షం వస్తే వీధుల్లో వర్షపు నీరు నిలబడి అంతా చిత్తడిగా మారుతోంది. అధికారులు స్పందించి చర్యలు చేయాలి.

- బోనం లక్ష్మీదేవి, కాకిరేణిపల్లె



వీధి దీపాలు వెలగడంలేదు

ఇటీవల కురిసిన వర్షానికి గ్రామంలో కారుచీకట్లు కమ్ముకున్నాయి. మొదటి బజారు, పెద్దమ్మ బజారు, కొత్తకొట్టాలు వీధుల్లో వీధి దీపాలు వెలుగడం లేదు. విద్యుత్తు అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- మార్తల శివారెడ్డి, కాకిరేణిపల్లె



పంచాయతీ కార్యాలయం ఎదుట నెలకొన్న అపరిశుభ్రత



డ్రైనేజీలు లేక వీధుల్లో నిలిచిన మురుగునీరు

పట్టుబడిన బంగారానికి రూ.50వేలు జరిమానా



పత్రాలను పరిశీలించి వివరాలు సేకరిస్తున్న సేల్స్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ జ్ఞానానందరెడ్డి

పులివెందుల, మే 10 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో శుక్రవారం రాత్రి పట్టుబడిన బంగారానికి సంబంధించి సేల్స్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ జ్ఞానానందరెడ్డి రూ.50వేలు జరిమానా విధించినట్లు తెలిసింది. హైదరాబాద్ నుంచి వస్తున్న ఓ కారులో బంగారం ఉన్నట్లు శుక్రవారం రాత్రి 9గంటల ప్రాంతంలో అందిన సమాచారం మేరకు పులివెందుల అసిస్టెంట్ కమిషనర్ (సేల్స్ ట్యాక్స్) జ్ఞానానందరెడ్డి తన సిబ్బందితో దాడి చేశారు. పట్టుబడిన కారు, బంగారాన్ని, తరలించే వారిని సహా కార్యాలయానికి తరలించారు. వీటి విలువ దాదాపు రూ.2కోట్ల వరకు ఉంటుందని అంచనా వేశారు. బంగారు, వజ్రాలకు సంబంధించి పత్రాలను పులివెందులలోని కార్యాలయంలో అదేరోజు అర్ధరాత్రి 2.30గంటల వరకు పరిశీలించారు. నిశితంగా పరిశీలించిన అనంతరం దాదాపు 50 గ్రాముల బంగారానికి సరైన పత్రాలు లేవని తేలింది. దీంతో రూ.50వేలు జరిమానా విధించినట్లు తెలిసింది. అనంతరం బంగారం, వజ్రాలు సంబంధించిన వారికి అప్పగించారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి : యూటీఎఫ్



డీఆర్‌ఓకు వినతిపత్రం సమర్పిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కడప ఎర్రముక్కపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ చేపడు తున్న పాఠశాలల పునఃవ్యవస్థీకరణ ప్రక్రియతోపాటు ఏ విధమైన స్పష్టమైన జీఓలు లేకుండానే రోజుకో ఆలోచనతో జరుగుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ అందరిలో తీవ్ర ఆందోళన కలిగిస్తుందని.. తక్షణం ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్‌బాబు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం యూటీఎఫ్ రాష్ట్రశాఖ పిలుపుమేరకు డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడును కలిసి ధర్నాకు సంబంధించిన నోటీసు అందేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వారం వారం గుర్తింపు ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహిస్తున్న సమావేశాలలో సమ స్యలు ప్రభుత్వం దృష్టికి తెచ్చినప్పటికీ పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఉపాధ్యాయుల్లో చెలరేగుతున్న ఆందోళన నేపథ్యంలో పాఠశాలల పునఃవ్యవస్థీకరణకు సంబంధించిన ఈఓ 117 రద్దు చేసి.. దాని స్థానే కొత్త జీఓ విడుదల చేసి దాని ఆధారంగా మాత్రమే పాఠశాలలను పునఃవ్య వస్థీకరించాలని కోరారు. మున్సిపల్ పాఠశాలల్లో అప్‌గ్రేడేషన్ ప్రక్రియ సత్వరమే చేపట్టి ప్రమోషన్లను ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో మే 12న డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా, 16న రాష్ట్రస్థాయిలో విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సీవీ రమణ, ఏజాస్ అహ్మద్, కార్యవర్గ సభ్యులు గోపీనాథ్, రామకేశవ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజయ హోటల్ పునఃప్రారంభం



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఇందిరెడ్డి మాధవరెడ్డి, వెంకటసుబ్బమ్మ

కడప ఎర్రముక్కపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని 1వ టౌన్ వద్ద ఉన్న టవర్ క్లాక్‌లో ఇందిరెడ్డి మాధవరెడ్డి ఆధ్వర్యంలో విజయ హోటల్‌ను శనివారం పునఃప్రారంభించారు. 1956లో నీలం సంజీవరెడ్డి ఆంధ్రా ఉపముఖ్య మంత్రి హోదాలో రహమతుల్లా టవర్ క్లాక్‌ను ప్రారంభించారు. ఇటీవల చాలావరకు దెబ్బతిన్న టవర్ క్లాక్‌ను ఇందిరెడ్డి మాధవరెడ్డి మరమ్మతులు చేసి సుందరంగా తీర్చిదిద్దారు. ఇందులోనే విజయ హోటల్‌ను ఇందిరెడ్డి మాధవరెడ్డి దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ముప్పై సంవత్సరాలుగా హోటల్ రంగంలో కడప, తిరుపతి నగరాల్లో ఉన్నామని, మిత్రులకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. నగర ప్రజలకు రుచికరమైన శుచి, శుభ్రతతో బ్రాహ్మణ భోజనంతో పాటు నార్త్ ఇండియన్ డిషెస్ కూడా అందుబాటులో కలవని తెలిపారు. కార్యక్రమంలో కాకర్ల రామాంజనేయులు, ఆడిటర్ కాశింఖాన్, షరీఫ్‌ఖాన్, ఆంధ్రస్పైస్ శ్రీకాంత్‌రెడ్డి, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

గండి ఆలయాన్ని వెంటనే ప్రారంభించాలి : తులసిరెడ్డి



గండి క్షేత్రంలో ఆగిపోయిన ఆలయ పునఃనిర్మాణ పనులను పరిశీలిస్తున్న తులసిరెడ్డి తదితరులు

చక్రాయపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో చేపట్టిన ఆలయ పునఃనిర్మాణ పనులపై అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు పులివెందుల ఎమ్మెల్యే దృష్టిసారించకపోవడంతో ప్రారంభానికి నోచుకోలేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డిలు అన్నారు. శనివారం వారు గండి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ గండి పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు మూల విరాట్టు తప్ప మిగతా నిర్మా ణాలన్నిటిని పునఃనిర్మించాలని ప్రభుత్వం రూ.28 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఐదేళ్లయినా ప్రారంభం కాలేదన్నారు. మూల విరాట్టుకు కాకుండా బాలాలయంలోనే పూజలు జరుగుతున్నాయన్నారు. ఈ ఆలయం పునఃనిర్మాణ పనులు మొదలుపెట్టాక ప్రారంభమైన కాణిపాకం, అయోధ్య దేవాల యాలు ప్రారంభమయ్యాయన్నారు. కానీ గండి వీరాంజనేయస్వామి ఆలయం మూల విరాట్‌కు పూజలు పునఃప్రారంభం కాలేదన్నారు. మిగిలిన అరకొర పనులు పూర్తిచేసి జూలై 15లోగా ఉత్తరాయణ పుణ్యకాలంలోనే పునః ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, ఈఓ వెంకటసు బ్బయ్య, అర్చక స్వాములు కేసరి, రాజారమేష్, వేంపల్లె మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, వేముల మండలశాఖ అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బస్సు కింద పడి యువకుడి మృతి



మృతి చెందిన అనకర్ల ప్రవీణ్ (ఫైల్)

బద్వేలు రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్త చెరువు గ్రామానికి చెందిన అనకర్ల ప్రవీణ్ (37) అనే వ్యక్తి జడ్డర్ల సమీపంలో ప్రమాదవశాత్తు బస్సు కింద పడి మృతి చెందాడు. వివ రాల్లోకి వెళితే.. కొత్తచెరువు గ్రామా నికి చెందిన ప్రవీణ్ శివదర్శిని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. బద్వేలు నుంచి హైదరాబాదుకు నడిపే ఈ బస్సు శుక్రవారం రాత్రి బద్వేలు నుంచి బయల్దేరి వెళ్లింది. జడ్డర్ల సమీపంలోకి రాగానే బస్సు బ్రేకులు సరిగా పడడం లేదని డ్రైవరు చెప్పడంతో బస్సు కిందకు వెళ్లి ప్రవీ ణ్ పరిశీలిస్తున్న క్రమంలో డ్రైవరు బస్సును ముందుకు కదల్చడంతో టైర్లకింద పడి దుర్మరణం పాలయ్యాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బస్సు హెల్పరుగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ప్రవీణ్ మృతితో కుటుంబం వీధినపడ్డట్లయింది. మృతదేహం ఇంకా గ్రామానికి చేరలేదు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతి చెందిన ఓబులరెడ్డి అలియాస్ గిరి

ప్రొద్దుటూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి తన సొంత ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన శనివారం ప్రొద్దుటూరు సాయి కుటీర్ రోడ్డులో వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు... సాయికుటీర్ రోడ్డులో మృతి చెందిన వ్యక్తి ఇంటి నుంచి పెద్ద ఎత్తున దుర్వాసన వస్తుండటంతో స్థాని కు లు ఇంటి తలుపులు తట్టి చూశారు. కానీ ఎంతకూ తలుపు తెరవక పోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఇంటి తలుపులు బద్దలు కొట్టి తెరిచారు. ఇంట్లో మార్తల ఓబులరెడ్డి అలియాస్ గిరి (43) అనే వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. ఓబులరెడ్డికి 2005లో వివా హమైంది. మద్యానికి బానిస కావడంతో ఏడు సంవత్సరాల క్రితం భార్య విడాకులు ఇచ్చింది. అప్పటి నుంచి ఓబులరెడ్డి ఇంట్లో ఒంట రిగా జీవిస్తున్నాడు. ఓబులరెడ్డి తల్లి క్యాన్సర్‌తో బాధపడుతుండగా అతని చెల్లెలు కర్నూలులో చికిత్స చేపిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఓబులరెడ్డి అనుమానాస్పదస్థితిలో మృతి చెందగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సింహ వాహనంపై చెన్నకేశవుడు



సింహవాహనంపై ఊరేగుతున్న చెన్నకేశవుడు

రాజుపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి సింహవాహనంపై శనివారం సాయంత్రం భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణలతో ఈ వేడుక అత్యంత వైభవంగా సాగింది. సింహవా హనంపై సతీసమేతంగా బయల్దేరిన స్వామివారు ఉత్సవం మాడవీధుల్లో కొనసాగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం పల్లకీసేవ, రాత్రి సింహవాహన సేవ నిర్వహించారు.

పి.బొమ్మేపల్లిలో ఘర్షణ

- 13 మందికి గాయాలు

జమ్మలమడుగు మే 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పూర్యపు బొమ్మేపల్లెలో శనివారం సాయంత్రం ఇరువర్గాలు ఘర్షణకు పాల్పడటంతో 13 మందికి గాయాలైనట్లు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. ఇంటి ముందు పేడ చల్లే విషయంలో మహిళల మధ్య మాటామాటా పెరిగి వివాదానికి దారితీసింది. జరిగిన విషయాన్ని మహిళలు తమ ఇంటి యజమానులకు తెలియజేయడంతో ఒక్కసారిగా ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. దీంతో ఒక వర్గానికి చెందిన రాజ చౌడప్ప, పెద్ద చౌడప్ప, రమణమ్మ, పెద్ద చౌడమ్మ, రామచౌడయ్య, సుహాసిని, మరో వర్గానికి చెందిన నాగంజి మునేష్, నాగేంద్ర, రమాదేవి, గురులక్ష్మి, నడిపి సుబ్బ రాయుడులు గాయపడ్డారు. అందులో తీవ్రంగా గాయపడిన నాగంజి నడిపి సుబ్బరాయుడు, రాజ, చౌడయ్య అనే ముగ్గురిని మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరుకు తరలించారు. ఈ మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



అంకురార్పణ సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, తులసి దంపతులు

జమ్మలమడుగు మే 10 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం సాయంత్రం అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీదేవీ భూదేవి సమేత నారాపురం వెంకటేశ్వరస్వామికి ఆనవాయితీగా తొలిపూజ జమ్మలమడుగు పట్టణానికి చెందిన మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, మాజీ చైర్‌పర్సన్ టి.తులసి పూజలు నిర్వహించారు. కాగా, బ్రహ్మోత్సవాలలో భాగంగా 11న ఉదయం ధ్వజరోహణం, సాయంత్రం ఉంజల్‌సేవ, అన్నమాచార్య కీర్తనలు రాత్రి పెద్ద శేషవాహనం, 12న చిన్నశేషవాహనం, 13న ముత్యపు పందిరి వాహనం, 14న కల్ప వృక్షవాహనం, 15న మోహినీ అలంకారం, 16 సర్వభూపాల వాహనం, 17న రథోత్సవ కార్యక్రమం, 18న సూర్యప్రభ వాహనం, 19న చక్రస్నానం, 20న పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయి.

ప్రత్యేక ఏర్పాట్లు : బ్రహ్మోత్సవాల సందర్భంగా రెండు రోజులకిందట ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీటీడీ పాలక మండలి సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఆలయాన్ని సందర్శించి పటిష్ట ఏర్పాట్లు జరిగేలా చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఆలయం ఎదురుగా అలంకరణ మండపం ఏర్పాటు చేశారు. ప్రత్యేక చలువ పందిర్లు వేశారు. ఆలయ ముఖద్వారం ఎదురుగా పార్కులో కూటమినేత గోణ పురుషోత్తంరెడ్డి భక్తులకు సౌకర్యం కోసం అరుగులు కట్టించారు.





విద్యుద్దీపాలంకరణలో ఆలయ ముఖద్వారం, అలంకరణ మండపం

రక్షణ లేకుంటే భక్షణే..

● నాటిన మొక్కలు మేకలకు ఆహారం ● ప్రజాధనం వృథా ● పట్టించుకోని అధికారులు


కంచె లేకపోవడంతో ఎండు పుల్లగా మారిన మొక్క

చెన్నూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): ఎండలో ఉంటూ పదిమందికి నీడనిచ్చే చెట్లు భగవంతునికి ప్రతిరూపాలు. స్వార్ధచింతన లేకుండా పదిమందికి ఉపయోగపడడమే చెట్ల ఔన్నత్యం. కొన్నేళ్లుగా ప్రభుత్వాలు వన సంరక్షణ సమితి పేరుతో మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను బయటి వ్యక్తులకు అప్పగిస్తున్నాయి. పచ్చదనం వెల్లివిరియాలి, పదిమందికి ఉపయోగపడాలన్న ఉద్దేశ్యంతో నాటిన మొక్కలకు ప్రస్తుతం రక్షణ కరువైంది. దీంతో ఆ మొక్కలు మేకలు, గొర్రెలకు ఆహారమవుతున్నాయి. ఫలితంగా నిధులు, శ్రమ ఎండపాలవుతోంది. ఆరు నెలల క్రితం వన సంరక్షణ సమితి కింద మండలంలోని ఉప్పరపల్లె నుండి పుష్పగిరి రోడ్డులో రెండున్నర కిలోమీటరు మేర దాదాపు వెయ్యికి పైగా మొక్కలు నాటారు. నాటిన మొక్కలకు ముళ్లకంప ఏర్పాటు చేయడం జరిగింది. రెండు, మూడేళ్లు నీళ్లు పోసి అవి ఎండకుండా కాపాడాల్సి ఉంది. అయితే నాటిన మొక్కల్లో కొన్నింటికి ముళ్లకంప ఏర్పాటు చేయకపోవడంతో ఆ మొక్కలను గొర్రెలు, మేకలు తినేశాయి. కొన్నింటికి నీరు సరిగా పోయలేదేమో అవి ఎండిపోయి పుల్లలుగా మిగిలాయి.

నీరు పోస్తేనే ప్రయోజనం

రెండు మూడేళ్లపాటు ఏ మొక్క ఎండాకాలంలో ఎండకుండా నీరు పోయాలి. నాటిన మొక్కలకు వేసవిలో వారంలో ఒకమారు మిగతా కాలంలో పదిరోజులకు ఒకమారు నీరు పోయాలి. ఇందుకోసం ట్యాంకర్లు మాట్లాడి ఒక్కోదానికి వెయ్యివంతున డబ్బులు ఇస్తున్నారు. అలాగే మొక్కల సంరక్షణ బాధ్యతను మరొకరికి అప్పగించడం జరిగింది. అయితే ఎండిన మొక్కలకు నీరు పోస్తే ఏం ప్రయోజనం. వాటిని ముందు కాపాడి ఉండింటే అలా బతికి ఉన్న మొక్కలకు నీరు పోసి ఉండే ప్రయోజనం కానీ, ఇలా ఎండిపోయిన వాటికి ఎన్ని ట్యాంకర్లు నీరు పోస్తే ఏం మేలని నిత్యం ఆ దారిన వెళ్లే ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

గతంలో ఆయకట్టుదారుల్లో కూడా ఇదే పరిస్థితి

ఉపాధిహామీ పథకంలో గతంలో వేలాది రూపాయలు వెచ్చించి కేసీ ఆయకట్టు రోడ్డులో మొక్కలు నాటారు. ఆ మొక్కలకు రక్షణ కల్పించలేదు. పక్కనే కాల్వలో నీరు ఉన్నా ఒక్క మొక్కా బతికిన దాఖలాలు లేవు. ముళ్లకంపతో రక్షణ కల్పించకపోవడంతో మొక్కలు మొత్తం మేకల ఆహారమయ్యాయి. ఇప్పుడూ అదే పరిస్థితి తీసుకరావద్దంటూ ప్రజలు కోరుతున్నారు.

నాటడం కాదు.. కాపాడడం గొప్ప



ఏ మొక్క అయినా నాటడం గొప్ప కాదు. వాటిని కాపాడుకునే బాధ్యత ఉంది. ఎందరో పెద్దలు మొక్కలు నాటిస్తున్నారు. కొందరు ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారు. అయితే రోజుకు ఒక్కమారైనా బాధ్యతలు తీసుకున్న వ్యక్తులు ఆ దారిలో తిరిగి మొక్కల పరిస్థితి ఏంటని గమనించి వాటిని కాపాడాలి.

- ఎం.క్రిష్ణకాంత్, చెన్నూరు

ముళ్లకంప ఏర్పాటు చేస్తే కదా..



మొక్కలు నాటిన ప్రదేశం రోజూ రకరకాల పశువుల రాకపోకలకు దారి. అలాంటి చోట వాటిని జాగ్రత్తగా కాపాడాలి. లేదంటే అవి తినేస్తాయి. ఇది అందరికీ తెలిసిందే. నాటిన వారు వాటిని కాపాడాల్సిన బాధ్యత ఉంది. నాటిన ప్రతి మొక్కకు ముళ్లకంపను ఏర్పాటు చేయాలి.

- ఎ.విశ్వం, చెన్నూరు





డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలి

కమలాపురం రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు బీసీ, ఈబీసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు రాజ్యలక్ష్మి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ మెగా డీఎస్సీ పరీక్షల కోసం స్థానిక బీసీ స్టడీ సర్కిల్ కేంద్రంలో ఆన్‌లైన్ ద్వారా త్వరలో ఉచిత శిక్షణ ఇవ్వబడునని తెలిపారు. టెట్‌పరీక్షలో అర్హత సాధించిన జిల్లా వాసులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9849919221, 9966418572 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

అంధుల ఆశ్రమంలో అన్నదానం

పులివెందుల టౌన్, మే 10(ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని అంధుల ఆశ్రమంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గుంట క్రిష్ణకుమార్(కిట్టు) తండ్రి విశ్రాంత ఉపాధ్యాయుడు గుంట వెంకటసుబ్బయ్య నాలుగో వర్ధంతి సందర్భంగా ఆశ్రమంలో అన్నదానం చేశారు. తన తండ్రి కూడా సామాజిక సేవ చేసుకుంటూ ఉపాధ్యాయ వృత్తిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. కార్యక్రమంలో భార్య విజయమ్మ, మధుసూదన్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రోత్సహించేందుకే నగదు బహుమతులు


బహుమతులు అందజేస్తున్న శ్రీధర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

సింహాద్రిపురం, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యార్థులను ప్రోత్సహించేందుకే నగదు బహుమతులు పంపిణీ చేస్తున్నట్లు వైజీఆర్ ట్రస్ట్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. వైజీఆర్ ట్రస్టు ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా సింహాద్రిపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వరుసగా రూ.4వేలు, రూ.3వేలు, రూ.2వేల ప్రకారం రూ.74 వేలు, ఇద్దరు ఇంటర్మీడియట్ విద్యార్థులకు రూ.20వేల నగదు బహుమతులను వైజీఆర్ ట్రస్ట్ కుటుంబ సభ్యులు పంపిణీ చేశారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు రవి చంద్రారెడ్డి, అంకన్న, విజయభాస్కర్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గండి ఉత్సవాలకు ఆహ్వానం


మహేశ్వర్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందిస్తున్న ఈవో, మాజీ చైర్మన్

చక్రాయపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు గండి క్షేత్రంలో జరిగే హనుమాన్ జయంతి ఉత్సవాలకు రావాలని పలువురికి ఆహ్వానం పలుకుతున్నారు. ఈ సందర్భంగా టీడీపీ మండల ఇన్‌చార్జి మహేశ్వర్‌రెడ్డికి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి శనివారం మండలంలోని నాగులగుట్టపల్లెలో ఉన్న ఆయన నివాసానికి వెళ్లి ఆహ్వానించారు.

మోక్షనారాయణుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


హోమాలు నిర్వహిస్తున్న సాయినాధశర్మ దంపతులు

కమలాపురం రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం పుణ్యక్షేత్రంలో మహాలక్ష్మి సమేత మోక్షనారాయణ స్వామి, శ్రీవల్లీదేవసేన సమేత ద్వికందర షణ్ముఖ సుబ్రమణ్యస్వామి, సంజీవని మూలికాసహిత వీరాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఆలయ ప్రధాన సేవకుడు కాశీభట్ల సాయినాధశర్మ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం గణపతిపూజ, సాయంత్రం ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠ, స్వామివార్ల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ బ్రహ్మోత్సవాలు ఈనెల 14వ తేదీ వరకు జరగనున్నాయి.

స్వచ్ఛభారత్ కార్మికుల వేతనాలు చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి

కడప సెవెన్ రోడ్స్, మే 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించకుండా సంవత్సరాల తరబడి శ్రమ దోపిడీ చేస్తున్నాయని, వెంటనే వారికి జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక హోచిమిన్ భవన్‌లో స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు స్వచ్ఛభారత్ కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నాయన్నారు. జిల్లాలో సుమారు 4 నుంచి 6 నెలల వరకు వేతనాలు ఇవ్వలేదని, వెంటనే వారికి జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పూట గడవడం కూడా కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శ జై.హనుమంతు, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, ఆనందయ్య, లక్ష్మయ్య, సహాయ కార్యదర్శులు సుధాకర్, కల్యాణ్, ప్రతాప్ పాల్గొన్నారు.

నేడు చెన్నకేశవస్వామి కల్యాణం

వీరపునాయునిపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరమలపల్లె గ్రామంలో ఆదివారం ఉదయం 10గంటలకు చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. భక్తులు విశేషంగా హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించి అన్నప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

‘అగ్రవర్ణాల నుంచి రక్షణ కల్పించండి’


ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న దళిత ఫోరం కన్వీనరు బూసిపాటి కిశోర్ , తదితరులు

కడప క్రైం, మే 10 (ఆంధ్రజ్యోతి): కడప నగర శివార్లలోని ఇందిరానగర్‌లో ఉంటున్న దళితులకు అగ్రవర్ణాల నుంచి రక్షణ కల్పించాలని దళిత ఫోరం కన్వీనరు బూసిపాటి కిశోర్ డిమాండ్ చేశారు. ఇందిరానగర్‌లోని నడివీధి గంగమ్మ దేవాలయం నిర్మించుకుని ఆలయం పక్కనే టీ స్టాల్ నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్న పల్లం చంద్రయ్యను అక్కడ నుంచి వెళ్లిపోవాలని అగ్రవర్ణాలకు చెందిన కొంతమంది బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఈ విషయంపై ఎస్పీ అశోక్‌కుమార్‌ను కలిసి దళిత సంఘాల నాయకులు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రయ్య గంగమ్మ ఆలయం పక్కనే టీస్టాల్‌తో పాటు ఆలయంలో అమ్మవారికి సేవ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. కానీ అక్కడ టీస్టాల్ ఉండడం ఇష్టం లేని కొంతమంది అగ్రవర్ణాలవారు కొంతమంది పేర్లతో దొంగసంతకాలు పెట్టించుకుని నగరపాలక కమిషనర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. ఈ విషయాన్ని కమిషనరు దృష్టికి కూడా తీసుకెళ్లామని, అగ్రవర్ణాలపై చర్యలు తీసుకుని రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బాధితుడు పల్లం చంద్రయ్య, మహాజనపార్టీ వ్యవస్థాపకులు సంగటి మనోహర్, దళిత సంఘాల నాయకులు సుబ్బరామయ్య శ్యాంసన్, లక్ష్మీనారాయణ, మోహన్, గిద్దలూరు బాబు, సుబ్బారావు పాల్గొన్నారు.

వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి


అవగాహన కల్పిస్తున్న కడప టూటౌన్ ఎస్ఐ సిద్దయ్య

కడప క్రైం, మే 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతపై వాహనదారులు, ప్రజలు, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పోలీసు అధికారులు సూచించారు. రోడ్డుప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా కడప జిల్లాలో రోడ్డు భద్రతపై కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఆదేశాల మేరకు ఎస్పీ సూచనలతో పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లావ్యాప్తంగా పోలీసుస్టేషన్ పరిధిలో విద్యార్థులకు, యువతకు, ఆటో, ట్యాక్సీ, లారీ డ్రైవర్లకు, ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణాలు చేయవద్దన్నారు. సీటు బెల్టు పెట్టుకోవాలని, మొబైల్ ఫోను వినియోగిస్తూ డ్రైవింగ్ చేయరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరూ లైసెన్సు కలిగి ఉండాలని, వాహనపత్రాలు తప్పక ఉండాలన్నారు.

ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలి


రైతులను సన్మానిస్తున్న దృశ్యం

లింగాల, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రకృ వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాలని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ భాస్కర్ రెడ్డి అన్నారు. లింగాల మండలం కామసముద్రం, ఇంటికబయ్యవారి పల్లె గ్రామాలలో శనివారం 2025-26 ఖరీఫ్ ప్రణాళిక సమావేశాలను నిర్వహించారు. పంటలను పండించే విధానాన్ని రైతులు మార్చుకోవాలని, ప్రస్తుతం రైతులు పంటలపై విషపూరితమైన క్రిమి సంహారక మందులు పిచికారీ చేస్తున్నారని, అలాగే సేంద్రీయ ఎరువులు కాకుండా విచ్చలవిడిగా రసాయన ఎరువులు ఉపయోగిసున్నారని తద్వారా విషపూరితమైన ఆహారాన్ని తీసుకోవాల్సి వస్తోందన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ రైతులను సన్మానించారు. కార్యక్రమాల్లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మూగబోయిన బీఎస్ఎన్ఎల్ సేవలు

వీరపునాయునిపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలో బీఎస్ఎన్ఎల్ సేవలు వారం రోజులుగా పనిచేయకపోవడంతో వినియోగదారులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. బీఎస్ఎన్ఎల్ సిమ్ ఉన్న వినియోగదారులు ఫోన్‌కాల్ చేయాలంటే నెట్‌వర్క్ రాకపోవడంతో వేరే వాళ్ల వద్ద ఉన్న ఫోన్ ద్వారా చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిగ్నల్ రాకపోవడంతో ఫోన్ చేయాలంటే దిక్కుతోచని స్థితిలో ఉన్నామని, ఇప్పటికైనా బీఎస్ఎన్ఎల్ సిబ్బంది స్పందించి మూగబోయిన బీఎస్ఎన్ఎల్ సేవలను వినియోగంలోకి తీసుకురావలని పలువురు వినియోగదారులు కోరుతున్నారు.

రేపు ఉరుసు

కడప కల్చరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక అల్మాస్‌పేటలో వెలసిన హజరత్ ఖ్వాజా సయ్యద్ షా అమీనుద్దీన్ హుస్సేని చిష్తి ఉరుఫ్ హజరత్ గేసుద రాజ్ బంధానవాజ్ ఉరుసు ఈనెల 12నుంచి ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. 12న గంధం, 13న ఉరుసు, 14న తహలీల్ జరుగనుందని తెలిపారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

వేంపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మేజర్ పంచాయతీలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై తీర్మాణం చేశారు. శనివారం వేంపల్లె పంచాయతీ కార్యాలయంలో సర్పంచు ఆర్.శ్రీనివాసులు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్ల కోసం ముమ్మర ప్రచారం

వేంపల్లె, మే 10(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్ల కోసం ప్రచారాన్ని ముమ్మరం చేసినట్లు హైస్కూల్ ప్లస్ హెచ్ఎం చెరుకూరు శ్రీనివాస్ తెలిపారు. బైపీసీ, సీఈసీ గ్రూపులలో ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మురళీనాయక్ సేవలు చిరస్మరణీయం

● నివాళులు అర్పించిన కాంగ్రెస్ నేతలు



కడప కలెక్టరేట్, మే 10(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ యుద్ధంలో అమరుడైన జవాను మురళీనాయక్ సేవలు చిరస్మరణీయమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి కొనియాడారు. శనివారం స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ దేశంలో యుద్ధ వాతావరణం నెలకొనడానికి పహల్గాంలో సరైన భద్రత లేకపోవడమే కారణమన్నారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు మే నెలలో జరగవలసిన 40రోజుల సంవిధాన్ బచావో అభియాన్‌ను, ఈనెల 12వ తేదీన పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జిల్లా పర్యటనను రద్దు చేసుకున్నట్లు సమాచారం అందిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అశోక్‌రెడ్డి, మహమ్మద్ అలీఖాన్, రఫీక్ ఖాన్, సిరాజుద్దీన్. సయ్యద్ గౌస్ పీర్, సుశీల్ కుమార్, రహమతుల్లా ఖాన్, మామిళ్ల బాబు, పాలగిరి శివ తదితరులు పాల్గొన్నారు.

మురళీనాయక్ యువతకు స్ఫూర్తి


మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైసీపీ నాయకులు

కమలాపురం రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల ప్రాణ రక్షణ కోసం యుద్ధభూమిలో తన ప్రాణాలను అర్పించిన వీరజవాను మురళీనాయక్ యువతకు స్ఫూర్తి అని వైసీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి అన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో శనివారం మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్-పాక్ మధ్య జరుగుతున్న పోరాటంలో ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా యుద్ధభూమిలో వీరమరణం పొందిన మురళీనాయక్ ఆత్మకు శాంతికలగాలన్నారు.

వీరజవాన్‌కు ఘన నివాళులు

పులివెందుల, మే 10 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధంలో వీర మరణం పొందిన మురళీనాయక్‌కు పులివెందులలో శనివారం ఘన నివాళులు అర్పించారు. స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయం వద్ద మురళీనాయక్ చిత్రపటానికి నివాళులు అర్పించి మౌనం పాటించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, వైసీపీపట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిషోర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

‘ఇండియన్ ఆర్మీ సత్తా ప్రపంచానికి తెలిసింది’

కడప ఎడ్యుకేషన్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో మన సైనికులు చేసిన పోరాటం వల్ల భారత సైన్యం సత్తా ఏమిటో ప్రంచానికి తెలిసిందని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియా, పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరగడం సంతోషకరమన్నారు. యుద్ధం వల్ల ఇరుదేశాలకు అన్ని విధాలా తీవ్రనష్టం వాటిల్లుతుందని, ఈ విషయంలో ప్రధాని మోదీ వ్యూహాత్మకంగా వ్యవహరించారని ఆయన కొనియాడారు. అయితే ఉగ్రవాదంపై మాత్రం ఇదే తెగువతో పోరాటాలు చేయాలని, దేశ ప్రజంతా ఉగ్రవాదంపై పోరుకు ఎప్పటికి మద్దతుగా నిలవాలన్నారు.

ఆపరేషన్ సిందూర్ కోసం పూజలు



కడప మారుతీనగర్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ భారతదేశ సైనికులు, ప్రజలు క్షేమంగా వుండాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మాచునూరు హరికృష్ణ ఆధ్వర్యంలో నగరంలోని పలు దేవాలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ యాదవ్, సీనియర్ నాయకుడు శ్రీనాథ్‌రెడ్డి, బీజేవైఎం జిల్లానాయకులు చాగలమర్రి ఓబులేసు, డాక్టర్ శివానాయక్ పాల్గొన్నారు.

వేంపల్లె ఆంజనేయస్వామి ఆలయంలో..



వేంపల్లె, మే 10(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని వేంపల్లెలోని ఆంజనేయస్వామి ఆలయంలో బీజేపీ నాయకులు శనివారం పూజలు చేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ దేశంలోని అన్ని పార్టీలతో సహా అన్ని వర్గాల ప్రజలు ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ఉన్నారని తెలిపారు. జవాన్ మురళీనాయక్ మృతి బాధాకరమన్నారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు బొమ్మిరెడ్డి లక్ష్మిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు పి.సుష్మ, మండల శాఖ అధ్యక్షుడు ఎం.ఈశ్వర్‌రెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు దొంతు సుమన్‌కుమార్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబోయిన రవియాదవ్, దేశం గోపీనాథ్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, కంతూరి వెంకటేశ్, లక్ష్మీనారాయణ, సురేష్, విశ్రాంత ఉద్యోగులు అనిల్, మస్తాన్, శివయ్య, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో యుద్ధం చేస్తున్న భారత్ సైనికులు బాగుండాలని, మనోధైర్యాన్ని కలిగించాలని శనివారం మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలో ఆంజనేయస్వామి ఆలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు గంగినేని తులసినాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని కోరారు. కార్యక్రమంలో నరేష్ నాయుడు, నరేంద్రనాయుడు, వెంకటేశ్, సాయిప్రతాప్‌రెడ్డి, శ్రీను, భాస్కర్‌రెడ్డి, బాష తదితరులు పాల్గొన్నారు.



హైస్కూల్‌ను పునరుద్ధరించాలి

● రద్దయిన పాఠశాలను తిరిగి మంజూరు చేయాలంటున్న క్రిష్ణంపల్లె వాసులు ● వసతుల్లేక అనుమతులివ్వలేదంటున్న అధికారులు


క్రిష్ణంపల్లెలో ప్రస్తుతం ఉన్న పాఠశాల


హైస్కూలు కావాలంటూ నిరసన తెలుపుతున్న క్రిష్ణంపల్లె గ్రామస్థులు

పోరుమామిళ్ల, మే 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని క్రిష్ణంపల్లె హైస్కూల్‌ను వెంటనే మంజూరు చేయాలని గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. 7వతరగతి వరకు ఉన్న స్కూలు కు మోడల్ స్కూలు, హైస్కూలు మంజూరు అ యితే తగిన వసతులు లేవన్న కారణంగా ప్రభు త్వం వాటిని రద్దు చేయడంతో ఆ గ్రామస్థులు తిరిగి తమ ప్రాంతంలోని విద్యార్థులకు పదో తరగతి వరకు తమ గ్రామంలోనే చదువుకునేం దుకు అవకాశం కల్పించి హైస్కూలును మంజూరు చేయాలని కోరుతున్నారు. గతంలో క్రిష్ణంపల్లె, పుల్లీడు, ఎస్.వెంకటరామాపురం ప్రాంతాల్లో మోడల్ స్కూలు, హైస్కూలు మంజూరయ్యాయి. కానీ ఇక్కడ ఉన్న తరగతి గదులకు వస తులు లేవనే సాకుతో ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. దీంతో క్రిష్ణంపల్లె గ్రామస్థులు గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించారు. ప్రస్తుతం అప్పర్ ప్రైమరీ స్కూలుకు ఉన్న తమ పాఠశాలను హైస్కూలుగా మారిస్తే గ్రామీణ పాంతంలోని పేద విద్యార్థులకు విద్యావకాశాలు కల్పించినట్లవుతుందని వారు పేర్కొంటున్నారు. ప్రస్తుతం తమ గ్రామంలో ఉన్న పాఠశాలలో పదో తరగతికి సరిపడా రూములు ఉన్నాయని, పాఠశాల ఆవరణలో 90 సెంట్ల స్థలం ఉందని ఈ సందర్భంగా గ్రామస్థులు కోరుతున్నారు.

అధికారుల తప్పుడు రిపోర్టు వల్లే సమస్య

విద్యాశాఖాధికారులు ఇచ్చిన తప్పుడు నివేదిక వల్లనే తమకు పదో తరగతి పాఠశాలకు అనుమతి లేకుండా పోయేందుకు కారణమైంది. క్రిష్ణంపల్లెలో 6, 7, 8 తరగతుల్లో 62 మంది, మొత్తం విద్యార్థులు 116 మంది మౌలిక సదుపా యాలు అన్నితరగతులు 96 సెంట్ల స్థలం ఉన్నప్పటికీ ఉన్నతాధికారులకు విద్యాశాఖాధికా రులు తప్పుడు సమాచారం ఇవ్వడం వల్ల పదోతరగతి అవకాశం లేకుండా పోయింది. క్రిష్ణంపల్లె పాఠశాల విషయంలో విద్యాశాఖాధి కారులు ఎందుకు వివక్ష చూపుతున్నారో అర్థం కావడంలేదు. పోరుమామిళ్ల మండలంలో వెంక టాపురం, ఈదుళ్లపల్లె పాఠశాలల్లో తగినన్ని తర గతి గదులు లేకపోయినా వాటిని మాత్రం మోడల్, ప్రైమరీ స్కూలుగా మార్చారు. క్రిష్ణంప ల్లెకు పదోతరగతి పాఠశాల అనుమతి తెచ్చేంత వరకు పోరాటం చేస్తాం. అవసరమైతే కోర్టుకు కూడా వెళ్లడానికి కూడా వెనుకాడం.

-రామచంద్రారెడ్డి, విద్యాకమిటీ చైర్మన్

మా చేతుల్లో ఏమిలేదు..

క్రిష్ణంపల్లె పదోతరగతి పాఠశాలకు సంబంధించి అనుమతికి డీఈవో కార్యాలయం నుంచి తమకు వచ్చిన ఆదేశాల మేరకు నార్మ్స్ పరిశీలించాం. క్రిష్ణంపల్లెలో పదో తరగ తి పాఠశాలకు సంబం ధించి ప్రపోజల్స్ రావడంతో డీఈఓ కార్యాలయం నుంచి సీజబులిటీ ఉందా? లేదా? అని అడగడం తో ఆ పాఠశాలను పరిశీలాంచాం, ఆ పాఠశాలలో మూడు చిన్న గదులు, మూడు పెద్దగదులు మాత్రమే ఉన్నాయి. పదో తరగతికి 8 తరగతి గదులు అవసరం అవుతాయి. ఈ నివేదికనే డీఈవో కార్యాలయానికి తెలియజేశాం. ప్రస్తుతం ఈ విషయం లాగిన్ అయింది. డీఈవో కార్యా లయం పరిధిలో కూడా లేదు. ఇప్పుడు అనుమ తులు రావాలంటే స్టేట్ పరిధిలో ఉంటుంది. ప్రస్తుతం ట్రాన్స్‌ఫర్స్ జరుగుతున్నాయి. ఇప్పుడు ఏమీ చేయలేని పరిస్థితి.

-కాశయ్య, ఎంఈవో, పోరుమామిళ్ల

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు


అలంకరణలో లక్ష్మీనరసింహుడు

బద్వేలు రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లెలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం శని త్రయోదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారి పెంచలయ్యస్వామి మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 13 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. మధ్యాహ్నం చెన్నవరం గ్రామానికి చెందిన పొదిలి పెంచలయ్య కుటుంబ సభ్యులు అన్నదాన కైంకర్యాన్ని నిర్వహించారు.

నరసింహుడి తిరునాళ్లు


లక్ష్మీనరసింహ స్వామివారు

బి.కోడూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎర్రిఓబన్న బావి తూర్పు కొండ గడిన వెలసిన నల్లగొండ లక్ష్మీ నరసింహస్వామి తిరునాల ఆదివారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త లక్ష్మిరెడ్డి తెలిపారు. స్వామి వారికి ఉదయం పూజ కార్యక్రమాలు, సాయంత్రం కోలాటం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చిన భక్తు లకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య


నాగేశ్వరనాయక్
ఎంఈవో, ముద్దనూరు

ముఖాముఖి

ముద్దనూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన, గుణాత్మకమైన విద్య అందుతుందని ఎంఈవో నాగేశ్వనాయక్ పేర్కొన్నారు.మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు ఉచితంగా విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్నదని తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

పశ్న: మండలంలో ఎన్ని ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి?

జవాబు: మండలంలో 37 ప్రాథమిక పాఠశాలలు, 6 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి.

ప్రశ్న: 2025-26 సంవత్సరానికి పాఠశాలల మార్పు జరిగిందా?

జవాబు: ముద్దనూరు స్టేషన్ ప్రాథమిక పాఠశాల,మెయిన్ ప్రాథమిక పాఠశాల, ఉప్పలూరు ప్రాథమిక పాఠశాలలను మోడల్ పాఠశాలలకు ఎంపిక చేశారు. .అలాగే యామవరం, ఆర్జీపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఒకటి నుంచి పదోతరగతి వరకు మార్పు చేశారు.

ప్రశ్న: మండలంలో హైస్కూల్ ప్లస్ 2 పరిస్థితి ఎలా ఉంది?

జవాబు: మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు హైస్కూలు ప్లస్2(ఇంటర్మీడియట్)లో ఉన్నాయి. అయితే హైస్కూలు ప్లస్2 చేసినప్పటి నుంచి విద్యార్థులు చేరకపోవడంతో సందిగ్ధంలో ఉన్నాయి.

ప్రశ్న: ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పది ఉత్తీర్ణత ఎలా ఉంది?

జవాబు: పదోతరగతిలో 89 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

ప్రశ్న: ఉపాధ్యాయుల కొరత ఉందా?

జవాబు: ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతలేదు.

విజ్ఞాన విహారయాత్రకు ప్రత్యేక బస్సులు

పోరుమామిళ్ల, మే 10 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన విహార యాత్రకు బద్వేలు డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజరు నిరంజన్ తెలిపారు. శనివారం ఆయన పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండులో విలేకర్లతో మాట్లాడుతూ బద్వేలు డిపో నుంచి శ్రీహరికోట శ్రీశాట్ రాకెట్‌ను సందర్శించుటకు ఈనెల 17న రాత్రి 10గంటలకు ఎక్స్‌ప్రెస్ నడుపుతున్నామని ఒక్కో టికెట్ రూ.800 ఉంటుందన్నారు. ఉదయం 6.55కు రాకెట్ లాంచింగ్ తరువాత పరిసర ప్రాంతాలైన సూళ్లూరుపేట అమ్మవారిగుడి, పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షుల నివాస క్షేత్రం, పెంచలకోన చూపుతామన్నారు. శ్లాట్ బుకింగ్ కోసం హెడ్మాష్టర్లు విద్యాసంస్థల కరస్పాండెంట్‌లు ఆధార్‌కార్డుల జిరాక్స్ తమకు ఇవ్వాలన్నారు. అదే విధంగా పెంచలకోన స్వయంభు పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని 12వ తేదీ వరకు గంట గంటకూ బద్వేలు నుంచి పెంచలకోనకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. కాగా ఈ నెల 17న శుక్రవారం రాత్రి 8గంటలకు మైసూరు ప్యాలెస్ విహారయాత్రకు బస్సు నడుపుతున్నామన్నారు. ఇందులో ఒక్కొరికి రూ.1800 టికెట్ ఉంటుందన్నారు. వివరాలకు 9959225779ను సంప్రదించాలన్నారు.

కుక్కల బెడదపై మున్సిపల్ అధికారుల చర్యలు

● ర్యాబిస్ టీకాతోపాటు బర్త్ కంట్రోల్ ఆపరేషన్‌లు

ప్రొద్దుటూరు , మే 10 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరులో ఉన్న వీధి కుక్కల సమస్యను పరిష్కరించడానికి మున్సిపల్ అధికారులు చర్యలు ప్రారంభించారు. శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో వీధికుక్కలను అనిమల్ పెట్ కంట్రోల్ సొసైటి సిబ్బంది వలలు వేసి పట్టుకున్నారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వయంగా కుక్కల పట్టివేతను పర్యవేక్షించారు. కుక్కలు పట్టుకునే సందర్భంలో వాటికి తీవ్రగాయాలు కావడం కాని ప్రాణాలకు అపాయం కలగడం కానీ కలగకూడదని వారిని ఆదేశించారు. పట్టణంలో దాదాపు 3 వేలకు పైగా కుక్కలు ఉన్నట్లు పబ్లిక్ హెల్త్ అధికారులు గుర్తించారు. విడత ల వారీగా కుక్కలను పట్టి వాటికి ర్యాబిస్ టీకాతో పాటు బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కుక్కల పట్టివేతను శానిటరీ సూపర్‌వైజర్ నూర్‌బాషా ఇన్‌స్పెక్టర్ సునీతలు పర్యవేక్షించారు.

చిన్నారికి పాము కాటు.. తప్పిన ప్రమాదం

పెద్దముడియం, మే 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నపసుపుల గ్రామంలో శనివారం ఉదయం ఎ.హేమపూజితరెడ్డి అనే చిన్నారి పాముకాటుకు గురయ్యాడు. అయితే వెంటనే ఆ చిన్నారిని జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తలరించడంతో త్వరితగతిన వైద్యం అందడంతో ప్రాణాపాయం తప్పింది., పరీక్షల నిమిత్తం రక్తనమూనాలను ల్యాబ్‌కు పంపడం జరిగింది. డాక్టర్ల పర్యవేక్షణలో మెరుగైన వైద్యంతో ప్రస్తుతం హేమపూజితరెడ్డి ఆరోగ్యం నిలకడగా ఉంది.

నేటి నుంచి ఖాజీపేటలో ఉరుసు

ఖాజీపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): కులమతాలకతీతంగా హజరత్ ఖ్వాజా సయ్యద్ మతహర్‌సావలి ఉత్సవాలు నాలుగురోజుల పాటు నిర్వహించనున్నారు. అగ్రహారంలో వెలసిన దర్గాలో కోరుకున్న కోరికలు తీరుతుండడంతో హిందూ ముస్లింలు కలిసికట్టుగా జరుపుకుంటారు. 11వతేదీన ఖాజీపేట నుంచి నసాన్ కార్యక్రమం, 12న గంధం, 13న ఖాజీపేట నుంచి జెండా మహోత్సవం 14న జియారత్ తహలీల్ తో పాటు 12, 13 తేదీల్లో గొప్ప ఖవ్వాలీ పోటీ నిర్వహించడంతో పాటు 13న భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. స్వామివారిని దర్శించేందుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే 13న బండలాగుడు పోటీలు కూడా నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ తెలిపారు.

బీటీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సోములవారి పంచాయతీ పరిధిలో రూ.78 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు పనులను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ప్రారంబించారు. శనివారం స్థానిక రామేశ్వరంలోని వాటర్ ట్యాంకుల వద్ద నుంచి ప్రధాన రోడ్డుతో పాటు మరో మూడు వీధుల్లో ఈ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, పంచాయతీరాజ్ డీఈ లక్ష్మినారాయణ రెడ్డి, ఏఈ గణేష్, సోములువారిపల్లి ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాజేష్, సైట్ ఇంజనీరు లోకేష్, టీడీపీ నాయకులు తోటా మహేశ్వరెడ్డి, పల్లేటి ప్రభాకర్‌రెడ్డి, డీలర్ జయరామిరెడ్డి, పల్లేటి చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జోహార్..! వీర జవాన్

మైదుకూరు రూరల్ ,మే 10(ఆంధ్రజ్యోతి) :దేశంకోసం పోరాడి వీర మరణం పొందిన మన సైనికుడు మురళినాయక్‌కు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంతో భారత్,పాకిస్తాన్ మధ్య జరిగిన యుద్ధంలో అసువులుబాసిన వీరజవాన్ మురళినాయక్ కు జోహార్ వీరజవాన్ అంటూ నివాళులర్పించారు. కొవ్వొత్తులు, కాగడాలు చేత పట్టి భారత్‌మాతాకు జై అంటూ నినాదాలు చేస్తుకొంటూ ప్రజలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ సభ్యడు యాపరాల చిన్న, ఏపీ రవీంద్ర, ధనపాల జగన్, భీమయ్య, పుట్టా ప్రభాకర్ యాదవ్, శీర్ల నాగమోహన్, యుగంధర్, మెప్మా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో: ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారత్-పాక్ మధ్య జరుగుతున్న భీకర యుద్దంలో పోరాడుతూ వీరమరణం పొందిన తెలుగు బిడ్డ మురళీ నాయక్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పహల్గాంపై ఉగ్రవాదుల దాడి అమానుషమన్నారు. ఈ కార్యక్రమంలో పొన్నపురెడ్డి, గిరిధర్‌రెడ్డి, రాష్ట్ర బీసీసెల్ సెక్రటరి గజ్జల లక్షుమయ్య, ముల్లాజానీ మహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బద్వేలులో: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత్- పాక్ మధ్య జరుగుతున్న దాడులలో శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన సైనికుడు మురళి నాయక్ వీరమరణం పొందడం పట్ల సీపీఎం నేతలు ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పట్టణ కార్యదర్శి శ్రీను మాట్లాడుతూ జవాన్ మురళి నాయక్ వీరోచిత పోరాటం చేసి ఉగ్రవాదులను హతం చేశారని అనంతరం ఉగ్రవాదుల దాడిలో వీరమరణం పొందారన్నారు. దేశాన్ని రక్షించడంలో ప్రాణత్యాగం చేసి సైనికుడికి నివాళులర్పించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.


భారత సైన్యానికి కొవ్వొత్తులతో సంఘీభావం

జమ్మలమడుగు మే 10 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో శనివారం టీడీపీ ఇన్‌చార్జీ దేవగుడి భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో భారత సైన్యానికి కొవ్వొత్తులతో సంఘీభావం తెలిపారు. టీడీపీ కార్యలయం వద్ద నుంచి పాత బస్టాండు వరుకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కొవ్వత్తులతో గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. భారతదేశం పాకిస్తాన్ యుద్ధంలో వీరమరణం పొందిన వీరజవాన్ మురళీనాయక్‌కు నివాళిలర్పించారు.

సైనికులు క్షేమంగా ఉండాలని ప్రత్యేక పూజలు

బద్వేలుటౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి) : సైనికులు క్షేమంగా ఉండాలని శనివారం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణవెంకటేశ్వరస్వామి ఆలయంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి పెనుముప్పుగా మారిన ఉగ్రవాదాన్ని పెంచిపోసిస్తున్న పాకిస్తాన్ కవ్వింపు చర్యలకారణంగా పెహల్గాంలో మనవారు చనిపోయారన్నారు. దానికి ప్రతీకారంగా మన భారతప్రభుత్వం ఆపరేషన్ సిందూర్‌పేరుతో దాడిచేసి 100మంది ఉగ్రవాదులను హతమార్చారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ భాస్కరరెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, అశోక్‌కుమార్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, ఆర్‌ఎస్ఎఫ్ నాయకులు రామకోటి రాజు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో : భారత సైనికులు క్షేమంగా ఉండాలని బీజేపీ నాయకులు పల్లెంశెట్టి పండరి, శ్రీనివాసరెడ్డి, బ్రహ్మయ్యలు పేర్కొన్నారు. శనివారం బీజేపీ ఆధ్వర్యంలో భారత సైనికులు యోగక్షేమాల కోసం లక్ష్మీ వెంకటేశ్వర దేవాలయంలో పూజలు నిర్వహించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాత్రింబవళ్లు, అహర్నిశలు శత్రుదేశ ఉగ్రస్థావరాలపై భీకర యుద్ధం చేస్తున్న సైనికులు విజయవంతంతో వీరగర్వంతో నిలవాలని పేర్కొన్నారు. అలాగే పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రమణాచారి, వంకదారి జయరాం, నగరి రవణ, తమ్మిశెట్టి రమణ, వెంకటసుబ్బయ్య, కడప సిద్దయ్య పాల్గొన్నారు.


కొండాపురంలో మాజీ జడ్పీ చైర్మన్ సీఎం బలరామిరెడ్డి భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి

కలెక్టర్, ఎస్పీలను కలిసిన డీసీసీబీ చైర్మన్


కలెక్టర్‌చెరుకూరి శ్రీధర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న డీసీసీబీ చైర్మన్

అట్లూరు, మే 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ మంచూరి సూర్యనారాయణరెడ్డి శనివారం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం ఇటీవల రాష్ట్రంలోని కొన్ని జిల్లాల డీసీసీబీ చైర్మన్‌లను నియమించింది. ఇందులో అట్లూరు మండలం వేమలూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు సూర్యనారాయణరెడ్డిని ప్రభుత్వం డీసీసీబీ చైర్మన్‌గా నియమించింది. ఆమేరకు ఆయన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అలాగే డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికైన సూర్యనారాయణరెడ్డి వారు అభినందించారు. అలాగే ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలుతెలిపారు. ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట మండల టీడీపీ నాయకుడు అరవ శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రతి కుటుంబానికి అండగా ఉంటాం


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందిస్తున్న పుట్టా

మైదుకూరు రూరల్ ,మే 10(ఆంధ్రజ్యోతి) :ప్రమాదంలో గాయపడిన,రోగాల బారినపడి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ప్రతి కుటుంబాన్ని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకొని వారి కుటుం బానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. ప్రొద్దుటూరులో ని పార్టీ కార్యాలయంలో శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పంపిణా చేశారు. మైదుకూరు నియోజకవర్గంలో 29 మంది బాధితు లకు సుమారు రూ.50,99,522లను చెక్కుల రూపంలో అందచేశారు. అంతేకాకుండా మైదుకూరు నియోజకవర్గానికి కేవలం నెల లోపల సుమారు ఒక్క కోటి 10 లక్షల రూపాయల చెక్కులను పంపిణీ చేసిన ఘనత పుట్టాకే దక్కుతుంది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

జూనియర్, డిగ్రీ కళాశాలల భవనాలకు భూమిపూజ


జూనియర్ కాలేజీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న రితీష్‌కుమార్‌రెడ్డి

బి.కోడూరు/అట్లూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): బి.కోడూరు, అట్లూరు మండలాల్లో శనివారం ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల ల భవనాలకు బద్వేలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ రితీష్‌కుమార్‌రెడ్డి భూమిపూజ చేశారు. బి.కోడూరు మండల పరిధిలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో జూనియర్ ఇంటర్ కాలేజీ నిర్మాణానికి. ఒక కోటి 20లక్షల రూపాయలు మంజూరైనట్లు ఆయన తెలిపారు. అక్కడికి వచ్చిన స్థానిక సీనియర్ టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ వెంకటసుబ్బారెడ్డి మోడల్ స్కూలుకు ఐదెకరాల స్థలాన్ని కేటాయించి దాదాపుగా 15సంవత్సరాలు అవుతుందని గతంలో ఇక్కడికి వచ్చిన మోడల్ స్కూలును ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి కాశినాయన మండలానికి తీసుకెళ్లారని కావున తమ మండలానికి మోడల్ స్కూలు ఏర్పాటు కృషి చేయాలని తెలిపారు. అలాగే కస్తూర్బాగాంధీ పాఠశాలలో వసతుల గురించి ప్రిన్సిపాల్ శ్రీలతారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బొజ్జ రోశన్న, మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ఎల్ఎస్‌పీ ప్రాజెక్టు చైర్మన్ వెంకటరమణారెడ్డి, అమర్‌నాథరెడ్డి, శేషారెడ్డి, మాజీ జడ్పీటీసీ భూపాల్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రాఘవరెడ్డి, క్రిష్ణారెడ్డి, బాలలింగారెడ్డి, బాలయ్య పాల్గొన్నారు. అట్లూరు మండలంలోని అట్లూరు కస్తూర్బా గురుకుల పాఠశాల ప్రాంగణంలో రూ.2.12 కోట్లతో డిగ్రీ కాలేజీ భవనానికి బద్వేలు నియోజకవర్గం సమన్వయకర్త రితీష్‌రెడ్డి భూమిపూజ చేశారు. మూడు తరగతి గదులకు మూడు వసతి గృహాలకు రూ.2.12 కోట్లతో భవన నిర్మాణం చేపట్టడం జరుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు గుర్విరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లిఖార్జునరెడ్డి, మండల నాయకులు అరవ శ్రీనివాసులరెడ్డి, పాలకొండ రామచంద్రారెడ్డి, పాలకొండు రాజశేఖర్‌రెడ్డి, జయక్రిష్ణారెడ్డి, లక్ష్మినరసారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నరసింహారెడ్డి, ఎల్.రామక్రిష్ణారెడ్డి, ప్రత్యేక అధికారి పణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బద్వేల్ అభివృద్ధికి శాయశక్తులా కృషిచేస్తాం

కలసపాడు, మే 10 (ఆంధ్రజ్యోతి): బద్వేల్ నియోజకవర్గ అబివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తామని బద్వేల్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి, కూటమి నాయకుడు బొజ్జ రోశన్నలు పేర్కొన్నారు. శనివారం కలసపాడు మండలం పెండ్లిమర్రి సమీపంలోని కస్తూర్బా పాఠశాలలో నూతన భవన నిర్మాణానికి వారు భూమిపూజ చేశారు. అనంతరం పాఠశాలలను పరిశీలించి అక్కడి సిబ్బంది, విద్యార్థినిలను పలు సమస్యలపై చర్చించారు. ఇటీవల కడపలో ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి జారిపడి మృతి చెందిన టీడీపీ కార్యకర్త రాజశేఖర్ కుటుంబాన్ని పరామర్శించి పార్టీపరంగా ఆదుకుంటామని వారు హామీ ఇచ్చారు. వారి వెంట మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సాధనకారి రంతు,మాజీ జడ్పీటీసీ భూపాల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, ఉపాధ్యక్షుడు పట్టాభిరెడ్డిలతో పాటు కలసపాడు మండలానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులుపాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

బద్వేలు, మే 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్హతల మేరకు వీఆర్‌ఏలకు ప్రభుత్వం పదోన్న తులు కల్పించాలని వీఆర్‌ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని కోరారు. శనివారం పట్టణంలోని ఎన్‌జీవో హోంలో రాష్ట్ర కార్యదర్శి గుర్రాల హరిక్రిష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన వీఆర్‌ఏల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వీఆర్‌ఏలకు తక్షణమే ప్రమోషన్లు కల్పించి ఊరట కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం స్పందన కొరకు వీఆర్‌ఏలు ఎదురుచూస్తున్నారని ఆర్డీఓ కార్యాలయం నూతనంగా ఏర్పడడంతో పాటు అన్ని తహశీల్దారు కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న అటెండర్ , వాచ్‌మెన్ పోస్టులలో వీఆర్‌ఏలను నియమించాలని కోరారు. ఇందుకోసం అధికారులను కలిసి వినతిప్రతాలు ఇవ్వాలని ఈ సమావేశంలో తీర్మాణించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు నల్లిపోగు నాగేషం, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెల్లూరు సురేష్, జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య ప్రధాన కార్యదర్శి నాగసుబ్బయ్య యాదవ్, ఉపాధ్యక్షుడు మణికుమార్, బద్వేలు మండల అధ్యక్షుడు గురవయ్య, కార్యదర్శి రాజేష్‌కుమార్, ఉపాధ్యక్షురాలు నాగరాణి, ఏరియా గౌరవాధ్యక్షుడు వీరశేఖర్ పాల్గొన్నారు.

ఘనజీవామృతం ప్రకృతి వ్యవసాయానికి తోడ్పాటు


ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రొద్దుటూరు రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): పంట సాగులో రసాయనాల వాడకం కంటే ఘనజీవమృతం ఎంతో శ్రేష్టమైందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పేర్కొన్నారు. శనివారం మండల పరిధి లోని కామనూరులో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ర్యాలీ నిర్వహించి ఘనజీవామృతంపై చైతన్యం కల్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి గ్రామ సర్పంచ్ షేక్ షమీమ్ ప్రకృతి వ్యవసాయ రైతు గౌసులాజం మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభసాటి అన్నారు. ఎంపీటీసీ పుష్పరాజ్, మహిళా రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బది మాధవి, శ్యామ్, అనిత, స్వప్నిక తదితరలు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ గ్రామోత్సవం

కాశినాయన మే10(ఆంధ్రజ్యోతి): పిట్టిగుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా శనివారం అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. పోలేరమ్మ, నాగదేవతలు, భైరస్వామి, పెండ్లి పోలేరమ్మ, పోతురాజు మూలవిరాట్‌లను ట్రాక్టర్‌లో ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో భాగంగా ఊరేగింపులో ఏర్పాటు చేసిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది.అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.